POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
నవంబరు 2021
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 07



శ్రీ పాద శ్రీ వల్లభస్వామి అంతర్ధానమైన రోజు
నవంబరు 2, 2021 (ఆశ్వయుజ బహుళ ద్వాదశి)

# భగవాన్ శ్రీ భరద్వాజ



శ్రీమతి శ్రీదేవి

హిందూ కాలమాన ప్రకారము పూజ్య గురుదేవులు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరు గారి జన్మదినోత్సవము, నవంబరు 11, 2021 (కార్తీక శుద్ధ సప్తమి)

# చెప్పింది అర్థం చేసుకోవాలి! ఆచరించాలి!

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

సర్వమానవులూ వారికి తెలిసినా తెలియకున్నా సహజంగానే కోరేవి నాలుగు. ధర్మము, అర్థము, కామము, మోక్షము. వీటినే మనవారు నాల్గు పురుషార్థాలన్నారు. కాని మన నిత్యజీవితాలు, అభీష్టాలూ గమనిస్తే అందరమూ అర్థకామాలను – అంటే ఒక వంక డబ్బు, ఆస్తి మొ॥నవి, మరోవంక వాటి సహాయంతో సంపాదించుకోగల సుఖాలు మాత్రమే కోరుతామన్పిస్తుంది. ప్రత్యేకమైన యత్నంతో, ఈ రెంటి కోసమూ పాటుపడుతున్నట్లు ధర్మ, మోక్షాలకోసం ప్రాకులాడమేమో నన్పిస్తుంది. ఎంత స్వల్పమైన ఆశ, అవసరమూ కన్పించినా అతి సులభంగా ధర్మాన్ని విడుస్తాము. ఎంత చిన్న అవసరము, కోరికా నెరవేర్చుకొనే యత్నంలోనైనా మోక్షాన్ని ప్రసాదించగల జప ధ్యానాది సాధనలను ప్రక్కకు పెట్టి, పైకిమాత్రం మనం దానిపై ఎంతో ప్రీతితో తపిస్తున్నట్లు కన్పిస్తూ.. జీవితంలో సమయము, అవకాశము లేనట్లు వాపోతాము. వార్తాపత్రిక, వారపత్రిక, సినిమా, టి.వి. పిచ్చపాటి కబుర్లు – వీటికున్నమాత్రం సమయం సాధనకు, సద్గ్రంథ పఠనకు వుండదు. ఏ కొద్దికాలమైనా, ఏ కారణంచేతనో సత్త్వగుణం మనలో పలవరించి కొంచెం క్రమబద్ధంగా పారాయణ, పూజ, జపము, భజన చేయడం జరుగుతే మరుక్షణమే పండిపోయామన్పించి గురువుల మవ్వచూస్తాము.

మనకు కల్గిన 'స్థితి' ని పెద్ద పెద్దవారితో పోల్చుకొని వారి వాక్యాలు, వేషభాషలూ అనుకరింపజూస్తాము. ఇతరులకు బోధింపజూస్తాము. కారణం మన సమాజంలో యిలా చేస్తే అర్థకామాలు తేలికగా నెరవేరుతాయి. కీర్తి, శుశ్రూష, అర్థమూగూడ తేలికగా సమకూరుతాయి. లోకాన్ని మరచి సాధన కంకితమైతేగాని లభ్యంగాని శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ సాయిబాబా, శ్రీ రమణ మహర్షి పొందిన స్థితులు మనకు పుట్టుకతోనే – ఏమి చేయకనే సిద్ధించాయని ఆత్మవంచన చేసుకొని పరవంచనకు సిద్ధమవుతాము. మనను సేవించడమొక్కటే మోక్షోపాయమని భావం స్ఫురించేలా వ్యవహరిస్తాము. ఎన్నో సంవత్సరాలు శ్రీ సాయిని ప్రత్యక్షంగా సేవించిన బాపూసాహెబ్ జోగుకు కల్గిన ప్రశ్న మనకూ ఏకాంతంలో ఎదురవుతుంటుంది. ఇంతకాలం నేను యీయనను సేవిస్తున్నాను. సద్గురువును 12 సంవత్సరాలు సేవిస్తే తమంతటివారుగా చేస్తారంటారు. మరి మననీయన అలా చేయలేదేమి? అన్పిస్తుంది. అయితే ఆయన చెప్పిన సమాధానమో? అది గుర్తొచ్చినా గుర్తొచ్చినట్లుండము. ఆయన నవ్వి ప్రక్కవారితో, "వీడు నన్ను నా స్థానంలోంచి నెట్టివేసి తాను కూర్చుందామని చూస్తున్నాడు" అన్నారు. మరుక్షణమే, "ఆ తలంపు మంచిదే! కాని ఓరిమి, పట్టుదల కావాలి" అన్నారు. అంటే ఏమిటి? ఠాకూర్ అనే భక్తునితో సాయి చెప్పారు "ఆ సద్గ్రంథం పూరికే చదివితే చాలదు. దానిని బాగా అర్థం చేసుకుని, మననం చేసి, ఆచరిస్తేగాని ఫలితముండదు. ఈ ఆధ్యాత్మ విద్య ఎంతో కష్టము. మన శక్తినంతటినీ వినియోగించి శ్రమిస్తేగాని ఫలితముండదు" అని.

శ్రమ చేయడమంటే ఎలా? తక్షణమే బ్రహ్మజ్ఞానం కోరి వచ్చిన శ్రీమంతునితో ఆయన, "పంచ ప్రాణాలు, పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారము – యీ అయిదూ సద్గురువుకు సర్వసమర్పణ చేస్తేగాని ఆత్మజ్ఞానం లభించదు" అన్నారు.

***మిగతా 28వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 నవంబరు-2021 సంచిక:07

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **చెప్పింది అర్థం చేసుకోవాలి! ఆచరించాలి!** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **అవధూత శ్రీ చివటం అమ్మ** | శ్రీమతి టి.శారదా వివేక్ | 05 |
| 03. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 04. | **రాని హోదా వెలగబెడితే..... .....ఉన్న ఉద్యోగం ఊడింది** | (సేకరణ) ఒక పాఠకుడు | 09 |
| 05. | **'భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి'** | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 11 |
| 06. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 07. | **మాతృదేవి స్మృతులు** | డాక్టర్ సౌజన్య | 16 |
| 08. | **మోక్ష ప్రదాత** | శ్రీ దత్త పాదుకా శ్రీనివాసులు | 18 |
| 09. | **నార్కే** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 10. | **ద్వారకామాయి అనుభవమండపము** | ఆర్. డి. నాయక్ | 25 |
| 11. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీమతి ఉప్పలపాటి సుజాతాదేవి | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

ఛీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


**సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.**

# అవధూత శ్రీ చివటం అమ్మ

*(గత సంచిక తరువాయి)*

*శ్రీమతి టి.శారదా వివేక్*

*'అవధూతావస్థలో ఉన్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించక, అందరికంటే మహోన్నతమైన స్థితిలో ఉంటారు. అట్టి పరిపూర్ణమైన అవధూత శ్రీ చివటం అమ్మ' అంటూ పూజ్య శ్రీ భరద్వాజ మాస్టర్ గారిచే కొనియాడబడిన అమ్మ జీవిత చరిత్రను ఆగష్టు 2019 సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. -ఎడిటర్*

## అమ్మ సూక్తులు

1. తాను మసి అవ్వడమే తత్త్వమసి.

2. అహం చస్తే బ్రహ్మమే.

3. రాముడు, కృష్ణుడూ అన్ని నామాల ముద్ద అయినదే విభూతి.

4. మృత్యువును తినేది రామ నామమే.

**గురువు గురించి:**

5. గురువు అనేవారు దారి చూపిస్తారు. ఆ దారిన నడిచి గమ్యం చేరవలసింది నువ్వే.

**సాధన గురించి:**

6. పాదు పెట్టందే కాయెట్టా వత్తదే!

7. ఆత్మజ్ఞానం అనే విత్తనం మొలకెత్తాలంటే సాధన అనే దుక్కి దున్నాలి.

8. రామా! రామా! అంటూ కూర్చో - మనసు తిరిగి తిరిగి వేరేదారి లేక అదే నిలుస్తుంది.

9. ధ్యానం బంగారు ముద్ద వంటిది. ధ్యానానికి మించినది ఏదీ లేదు.

10. మన నీడ పడేంత మేర తప్ప దృష్టిపైకి పోనీయకూడదు.

11. కన్ను పెద్ద గుమ్మం, నోరు దొడ్డి గుమ్మం.

12. యోగం లేని జీవితమంతా తప్పే.

13. తిరిగితే తిప్పలు, కూర్చుంటే కుప్పలు.

మిగతా 28వ పేజీలో

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## ప్రశ్న :-పూనకాలు ఎంతవరకు నిజం?

**జవాబు:**-శ్రీ సాయి వంటి మహనీయులు ఎవరినీ పూనడముండదు. నిజానికి దేవతలు గూడ పూనరు. ఒక దయ్యాలు మాత్రమే పూనుతాయి. ఈ దయ్యాలు పట్టినవారు అని తలచబడేవారిలో గూడ, వందమందిలో నిజంగా దయ్యం పట్టినవారు ఒకరిద్దరుకూడా వుండరు. మిగిలిన వారిలో ఎక్కువమంది ఇంట్లో వారిని సాధించడానికో, బాధ్యతలు తప్పుకోడానికో అలా నటిస్తారు. మిగిలినవారిలో ఎక్కువ మందికి శరీరంలోనో, మనస్సులోనో దాగియున్న దెబ్బవలన అలాటి భ్రమలు కలుగుతాయి. మంచి హెమియో డాక్టరు దగ్గర మందిప్పిస్తే తగ్గిపోతాయి.

శ్రీ సాయిబాబా సాక్షాత్తు భగవంతుడే. ఆయన విశ్వమంతటా వ్యాపించియున్నాడు. ఆయన ఎవరిలోకైనా ఎలా ప్రవేశిస్తాడు? మీ ఊరిలోని స్థలమంతా మీయింటికి వచ్చివేయడమెలా సాధ్యం? ఒకవేళ ఆయన ఎవరికైనా పూనుతారని ఎవరైనా వాదించారనుకుందాం. ఈనాడు దేశంలో ఎంతోమంది అలా చెప్పేవారున్నారు. వారిలో ఒకరికి పూనినమాట నిజమైతే, అదే సమయంలో మిగిలినవారందరికీ పూనడమెలా సాధ్యం? వీరిలో ఎవరు నిజం చెబుతున్నట్లు? ఎవరు అబద్దం చెబుతున్నట్లు? అది నిర్ణయించేదెలా?

ఆధ్యాత్మికత అంటే ఏమో, సద్గురు వంటే ఏమో ఏమాత్రమూ తెలుసుకోడానికి ప్రయత్నం చేయకుండానే అమాయకంగా నమ్మేసే వారి వారి 'భక్తుల' అభిప్రాయాలే, విశ్వాసాలే ప్రమాణమనుకుంటే ఈ పూనే వారందరి భక్తులు తాము నమ్మినవారే నిజమని, మిగిలినవారిది వట్టి మోసమని అంటారు.

శ్రీ సాయిబాబా శిరిడీలో సశరీరులుగా నివసించిన యాభై ఎనిమిది సంవత్సరాల కాలంలోనే ఆ దేహానికి పరిమితులుగా ఎన్నడూ లేరు! శ్రీమతి తార్కాడ్ కుక్కకు అన్నం పెడితే శ్రీ సాయికి కడుపు నిండింది; హంసరాజ్ పిల్లిని కొడితే ఆయనకు తగిలింది; శిరిడీకి చెందిన ఆబోతును కసాయివానికి ఒక ధూర్తుడు అమ్మివేస్తే శ్రీ సాయి వేరొక భక్తుడికి కలలో కన్పించి తమనే కసాయివాని వాకిట్లో కట్టివేసినట్లు చెప్పారు. ఆయన సశరీరులుగా ఉన్నప్పుడే ఆ దేహానికి పరిమితులుగా లేకుంటే, ఈనాడు వీళ్లందరి కోసము వారిలో ప్రవేశించి, వారి దేహాలకు పరిమితులు గావడం

ఆయనకెలా సాధ్యం?

సాయిబాబా పత్రికలో గాని, బొంబాయినుండి వెలువడుతున్న 'సాయిలీల' (ఇంగ్లీషు) పత్రికలోగాని వెలువడుతున్న భక్తుల అనుభవాలు చూస్తుంటే, ఆయన ఎందరికైనా స్వప్నంలోనో, శరీరంతోనో కన్పించి తమ సందేశ మివ్వగలరని నిస్సందేహంగా తెలుస్తుంది. అది ఆయనకు చేతగాకుంటేగదా ఆయన ఎవరినైనా పూని భక్తులకు సందేశాలివ్వవలసిన అగత్యం పట్టేది? అందుకే సాయి సశరీరులుగా శిరిడీలో నివసించిన 58 సం॥లలో ఒక్క భక్తుడికి గూడ ఆయన పూనలేదు. అయితే కొందరలా చెబుతున్న సందర్భాలున్నా గూడ చరిత్రకెక్కలేదేమో ననిపిస్తుంది. కారణం, దాసగణు మహారాజ్ వ్రాసిన హరికథలో అందుకు సూచనలున్నాయి. గంగగిర్ బాబా శిరిడీ వచ్చి, మారుతీ ఆలయంలో కూర్చొని భక్తులతో మాట్లాడుతూ, భుజంపై నీటికుండ పెట్టుకుని మశీదుకు పోతున్న బాబాను అనుసరించాడు. అప్పుడు సాయి మాటల సందర్భంలో అతనితో "లౌకిక సుఖాలు అనే కల్లు త్రాగి మైకంతో గంతులేస్తున్న ఈ మానవుల మధ్యకు భగవంతుడు నా నెత్తిమీద ఒక పాలకుండ పెట్టి, వారందరికీ సన్మార్గం బోధించమని వీళ్ళ మధ్యకు పంపించారు. కాని నా వద్దకు వచ్చిన వారందరూ నా పాలకుండపై రాళ్ళు రువ్వి గేలిచేస్తున్నారు. కొందరు "సాయిబాబా మమ్మల్ని పూనాడు, మా వద్దకు రండి. ఇప్పుడు ఆయనవద్ద ఏమీలేదు. ఆయన చెప్పినది వినవద్దు! అంటున్నారు" అని చెప్పారు. అంటే ఇటువంటి గొడవలు ఆయన శరీరంతో ఉండగానే జరిగాయన్నమాట! ఇటువంటివాటి గురించి ఆయనకు ఎంత అసమ్మతియో, ఎంత జుగుప్సో ఈ సన్నివేశం తెలుపుతుంది. సాయి భక్తులమని చెప్పుకుంటూ ఇటువంటి అసహ్యకరమైన అంశాలను ప్రచారం చేయడం మహాపాపం, ఎంతో ఏహ్యమైనది.

తిన్నగా తన భక్తునికి సందేశమివ్వడం శ్రీసాయికి చేతగాదనుకుంటే తప్ప, అలా నేరుగా ఆయన నుండి భక్తులు సందేశాలు పొందుతున్న అనుభవాలన్నీ కల్పనలనుకుంటే తప్ప ఈ పూనకాలను నమ్మవలసిన అగత్యముండదు. శ్రీ సాయి అలా నేరుగా సందేశమివ్వలేని వారైతే, వారిలా పూనకాల ద్వారా సందేశమిచ్చినా, అది నమ్మవలసినంత విలువగలది కానేకాదు.

ఇటువంటి వారెందరివద్దకో నేను వెళ్ళి పరీక్ష చేసి చూశాను. వారి ద్వారా సాయి చెబుతున్నారని వాళ్ళు చెప్పేవి వ్రాసి వుంచుకుని, వాటిలో ఎన్ని నిజమవుతాయో తర్వాత పరీక్షగా గమనించాను. మీరు గాని, నేనుగాని తోచినదెల్లా చెప్పేస్తుంటే ఎంతవరకు నిజమౌతాయో అంతకుమించి యివేవి నిజంగావు. మీరు, నేను కళ్ళుమూసుకు చెప్పినా కొన్ని తప్పక నిజమవుతాయి. కాకుంటే సామాన్య ప్రజలు ఎంతో అమాయకులు, నిజమైన ఆధ్యాత్మికత అంటే ఏమిటో, సద్గురుని సహాయం పారాయణ మొ॥న రీతులలో ఎలా పొందాలో తెలియనివారు ఎందరో వున్నారు. వాళ్ళ అజ్ఞానమే, మూఢమైన భయాలు మరియు ఆశలే ఈ పూనకం దుకాణాలకు పెట్టుబడి.

ఈ గణాచారులు చెప్పినది ఏ కొద్దిశాతమో కాకతాళీయంగా నిజమవుతుంది. అది చూచిన వెర్రిబాగులవారు లోకం మీదబడి దండోరావేస్తారు. ఈ గణాచారులకు భారీయెత్తున పూజలు చేసి, సమాజంలో ఈ మూఢనమ్మకాన్ని పెంచుతారు. కొందరి వైఖరి చూస్తుంటే దీనిని వ్యాపారంగా కూడా వాడుకొని, వచ్చే లాభాలతో పెద్ద పెద్ద వాటాలు గూడా తీసుకుంటారేమో అనిపిస్తుంది. ఇటువంటి కలియుగ విన్యాసాన్ని, ఈ పూనకాలనూ నిరసించడం గూడ శ్రీ సాయినాథుని అవతారకార్యాలలో ఒకటనిపిస్తోంది.

ఇటువంటివి మచ్చుకు మూడు అనుభవాలు చెబుతాను.

(1) 'సత్యసాయి మా శరీరంమీదకు వచ్చారు' అనో "మేము సత్య సాయిబాబాగారి మరొకరూపం" అనో చెప్పుకుంటూ చిల్లర మహిమలు కొందరు చేయసాగారు. అదంతా పచ్చిమోసమని, నమ్మవద్దని శ్రీ సత్యసాయి స్పష్టంగా ప్రకటించారు! వారి మాసపత్రికలో గూడ అటువంటి హెచ్చరికలు ఎన్నోసార్లు చేసారు. అయినా ఆయన పేరిట గూడ ఈ తమాషాలు అలాగే కొనసాగుతున్నాయి.

(2) కొందరు భక్తురాండ్రు జిల్లెళ్ళమూడి అమ్మ తన వంటి మీదకు వచ్చారని చెప్పుకుంటుండేవారు. అది గూడ అమ్మ శరీరంతో వున్నప్పుడే! అటువంటి ఒకామె తన 'భక్తుల' తో, "ఈ సంగతి మీకందరికీ ప్రత్యక్షంగా నిరూపిస్తాను. మనమందరము అమ్మ వద్దకుపోతే ఆమె నన్నెలా ప్రతిరూపంగా గుర్తిస్తుందో మీరే

చూడవచ్చు!" అని చెప్పి అందరినీ వెంట బెట్టుకుని అమ్మ వద్దకొచ్చింది. ఈ నాటక నిర్వాహకులు ఒక్క అడుగు ముందుగా వచ్చి అమ్మతో చెప్పారు. అమ్మ తనయొక్క ఈ ప్రతిరూపం కోసం ప్రత్యేకంగా సింహాసనం వేయించి ఆమెకు కూడ పాదపూజ ఏర్పాటు చేయిస్తుందని వాళ్ళు ఆశించారు. అమ్మ అలాంటివేమీ చేయలేదు. ఆ ప్రతిరూపం రానే వచ్చింది. కాని ఆమెను ఎక్కడ కూర్చోబెట్టాలన్నది ఆమె భక్తులకు అర్థం కాలేదు. ఆమెకోసం ప్రత్యేకంగా కుర్చీవేయబోతే ఆశ్రమంలో వారు అంగీకరించలేదు. చివరకు ఆమెతో అమ్మ యిలా అన్నారు! "నీవే జిల్లెళ్ళమూడి అమ్మనని అందరికీ చెప్పుకుంటున్నావు. కాని నేను జిల్లెళ్ళమూడి కరణంగారి భార్యను కూడ, నీవు కూడ అలానే చెప్పుకుంటావా ఏమి? ఒకవేళ నీవలా చెప్పినా, నీవు నేను కాజాలవు. కారణం నా భర్తే నాకు దైవం. ఆయనకుమించి నాకు వేరొక దైవం లేదు. ఏదేదో ఆశించి ఇంకొకరి భర్తను నాభర్తగా చెప్పుకునే దుస్థితి నాకింకా కలుగలేదు" అని మందలించారు. అంతటితో ఆ ప్రతిరూపం యొక్క భక్తులకు చిర్రెత్తింది. ఇంకొకరికి కీర్తి ప్రతిష్టలు కలుగుతుంటే ఓర్వలేక అమ్మ అలా బొంకుతున్నారని చాటుకున్నారు. అంత బలీయమైన భ్రాంతులున్న అమ్మయొక్క ప్రతిరూపమని ఆ 'భక్తురాలు, చాటవలసిన అవసరమేమని ఆ మూఢులకు తోచలేదు.

(3) ఇటువంటి ఇంకొకరివద్దకు గూడ నేనెవరో ముందుగా చెప్పా పెట్టకుండా వెళ్ళాను. ఆ 'ప్రతిరూపం' నన్ను కనీసం గుర్తించనైనా లేకపోయింది. ఆమె జిల్లెళ్ళమూడి అమ్మ అయితే నన్ను గుర్తించలేకపోయే ప్రశ్నే లేదు! ——-ఇలా ఎన్నో! --- వ్రాసిన కొద్దీ వున్నాయి!

అయితే, తమనెవరో పూనుతున్నారని చెప్పేవారిలో కొద్దిమంది దగ్గర కొన్ని అద్భుతాలు జరుగుతాయి. వారు చెప్పినవి కొన్ని జరుగుతాయి కూడ. కొన్ని మహిమలూ జరుగుతాయి. కాని అందుకు కారణం దేవతలుగాని, సాయి వంటి మహాత్ములుగాని నిజంగా పూనడం మాత్రముకాదు. పూర్వజన్మలో వారు తీవ్రంగా ఒక దైవాన్ని ఉపాసించడం వలన ఆ పూర్వజన్మవాసనగా ఈ జన్మలోకూడ వారికి మనస్సు ఆ దైవంపై లగ్నమై తాత్కాలికంగా వారందులో లీన మవుతారు. ఆ ధ్యానంలో తన్మయు లవుతారు – సినిమా చూచేవారందరూ ఆ సినిమాలో తన్మయులైనట్లు. అపుడా సినిమాహాలంతా ఏ ఒక్క పేక్షకుని బుర్రలోకి చొరబడదు. ప్రేక్షకుల మనస్సులే తాము చూచే సినిమాలో లీనమై, భావపారవశ్యం చెందుతాయి. ఇదే పూర్వజన్మలోని వాసనా బలంవలన జరిగినపుడు వారిలో కొన్ని అతీతశక్తులు మేల్కొంటాయి. అందుకు కారణం మనలోని జీవాత్మ నిజానికి పరమాత్మ స్వరూపమే! చక్కెరకుండే తీపి దానితో చేసే వంటకాలన్నింటికీ వచ్చినట్లే, ఆ పరమాత్మలోని శక్తులన్నీ జీవునిలోనూ వుంటాయి. కాకుంటే వాళ్ళ మనసులు బహిర్ముఖమై చంచలంగా వున్నప్పుడు ఈ శక్తులు మరుగుపడిపోతాయి – తొట్టిలోని స్వచ్ఛమైన నీటిని బాగా కలియబెట్టినపుడు ఆ తొట్టెకు అడుగువున్నా, అది కనిపించకుండా పోయినట్లు. పూర్వజన్మ సంస్కారం వలన మనస్సు ధ్యానంలో నిలచినపుడు, క్షణికంగా ఈ దివ్యశక్తులలో ఏ కోటి అంశమో తాత్కాలికంగా ప్రకటమవుతాయి. అంతేగాని ఆ సమయంలో వారిలో జొరబడటానికి ఎల్లెడలావున్న పరమాత్మకుగాని, పరమాత్మ స్వరూపులైన మహాత్ములకుగాని సాధ్యముగాదు, అవసరమూ లేదు. ఎవరైనా నిజంగా అలా పూనేటట్లయితే వారు దయ్యాలకువలె అజ్ఞానులేగాని, మహాత్ములు కాజాలరు; ఆ దయ్యాలకు క్షుద్రశక్తులు ఉండవచ్చు, అవి తాము దేవతలమనో లేక మహాత్ములమనో చెబుతూ శక్తులు ప్రదర్శించనూవచ్చు.

దేవతలు పూనడం గురించికూడా యిలానే చెప్పవలసి వుంటుంది. అగ్ని, వాయువు మొ॥న పంచభూతాలు, వాటి అధిదేవతలూ విశ్వవ్యాప్తంగా వస్తుజాలమంతటిలోనూ, అన్ని జీవ దేహాలలోనూ వుంటారు. కారణం సృష్టి అంతా పాంచభౌతికమే. ఇవన్నీ కలసి భగవంతుని యొక్క విశ్వరూపమనే దేహమని శ్రీకృష్ణుడిచ్చిన విశ్వరూప దర్శనము, ఆయన చెప్పిన విభూతియోగమూ, భాగవతమూ, విష్ణుపురాణము మొదలైనవన్నీ చెబుతున్నాయి. దీనినే శృతులు "సర్వం ఖల్విదం బ్రహ్మ" – "ఈ సర్వమూ బ్రహ్మమే"! "ఈశావ్యాస మిదం సర్వం" "ఈ సర్వమూ ఈశ్వరుని మయము", "ఏకం సత్" "సత్యమైన పరమాత్మ ఒక్కడే" అన్న వాక్యాలలో చెప్పాయి. కనుకనే మన శరీరంలోని వివిధ

***మిగతా 28వ పేజీలో***

# రాని హోదా వెలగబెడితే.....
# .....ఉన్న ఉద్యోగం ఊడింది

**(సేకరణ) ఒక పాఠకుడు**

సర్వజ్ఞుడైన సాయిబాబా తనవద్దకు గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్ధే వస్తాడనీ, మహారాష్ట్ర దేశములో సాయిభక్తి ప్రచారము చేస్తాడనీ అతని ప్రాముఖ్యమును ముందుగానే గుర్తించారు. ఈతడొక పోలీసు 'ఆర్డర్లీ' (కానిస్టేబుల్)గా యుండి డిప్యూటీ కలెక్టరయిన నానాసాహెబ్ చందోర్కరు మకాము (Camp) నకు వెళ్ళిన చోటికల్లా వెళ్ళవలసి వచ్చేది. బాబా ఇతనిని తన వద్దకు రప్పించుకొనుటలోని ఉద్దేశ్యములు రెండు: ఈతడు ఆధ్యాత్మిక పథములో ఉన్నవాడు గనుక ఆ పథములో ఇతనిని ఇంకా ఉన్నతదశకు తీసికొనివెళ్ళుట. తద్వారా ఇతడు సాయిభక్తి ప్రచారము చేసి తరించుట.

ఇతడు ఉద్యోగ ధర్మముగా 1895 సం॥ ప్రాంతములో నానాసాహెబ్ చందోర్కరుతో కలిసి శిరిడీ వెళ్లాడు. అంతేగాని, బాబాపై భక్తితోనూ కాదు, ప్రేమతోనూ కాదు. అసలు బాబాను గూర్చి ఏమియు తెలియనే తెలియదు. బాబా ఇతనిలో ఎంతో ఆశ్చర్యమైన పరిణామము కల్గించారు. ఇతడుగూడ సాయి ఎంత శక్తిమంతులో, తనపై బాబా ప్రభావమెంతో, తనకు ఎన్నో కష్టములు, అడ్డంకులు కల్గించి కూడ తన జీవిత పంథానెలా మార్చి వేశారో గుర్తించి, ముఖ్యముగా మహారాష్ట్రములో సాయిభక్తి ప్రచారము జీవితాంతము చేసి సాయికి దాసానుదాసుడైనాడు ఆ క్రమ పరిణామము గమనిద్దాము. ఇంక ఇతని పేరు 'దాసగణు'.

ఇతడు నైజాము రాష్ట్రములోని నాందేడు వాస్తవ్యుడు. వీధి నాటకములలో స్త్రీ పాత్ర ధరించి అశ్లీలమైన పాటలు రచించి, పాడి ఆనందించేవాడు. ఒక ప్రభుత్వోగికి ఇది అనుచితము. ఇతనికి ఉద్యోగములో ప్రమోషను పొంది సబిన్స్పెక్టరుగా పని చేయాలని గాఢమైన కోరిక. కొన్నాళ్ళకు 'హెడ్ కానిస్టేబుల్' అయ్యాడు. సబిన్స్పెక్టరు పరీక్ష కూడ ప్యాసయ్యాడు. సత్యము, ధర్మము, న్యాయముగా విధి నిర్వహించాలనుకొనే వారికి ఆ డిపార్టుమెంటులో పనిచేయుట, ప్రమోషను పొందుట చాల కష్టము. ఎన్నో అవాంఛనీయమైన ఒత్తిళ్ల నెదుర్కోవాలి. ఇటువంటి ప్రమాదములు గుర్తించి బాబా దాసగణుతో ఈ రెంటినీ విడిచి పెట్టమన్నారు. చందోర్కరుకూడ సాయిచెప్పిన ప్రకారము నడచుకొనుట మంచిదని చెప్పాడు. ఏలాగో వీధి నాటకములలో వేషము వేయుట మానివేశాడు. కాని ఉద్యోగము వదల్లేదు. పైగా సబ్-ఇనస్పెక్టరవ్వాలనే కోరిక ఎక్కువైనది. "ఆ పదవి నీకు రాదు, ఈ ఉద్యోగము వదిలెయ్యి" అని బాబా అన్నప్పుడల్లా, బాబా! నేను పరీక్ష పాసయ్యాను. సబిన్స్పెక్టరుగా కొన్ని నెలలు పనిచేసి ఉద్యోగము వదిలేస్తా"ననేవాడు. "నీవు పరీక్ష ప్యాసయినా నీకా పదవి రాద"నే వారు బాబా. దాసగణు వింటేగా? ఇంక దాసగణుకు కష్టములపై కష్టములు, సమస్యలపై సమస్యలు కల్పించియైనా అతడా ఉద్యోగము విడిచిపెట్టే లాగున చేయటమొక్కటే బాబాకు మార్గము. అదెలా జరిగిందో చూద్దాము.

దాసగణుకు పుణ్యక్షేత్రములు దర్శించుట యందాసక్తి మెండు. తరచు తన ఉద్యోగపు సరిహద్దులు కూడ దాటి దూర ప్రాంతములకు వెళ్ళేవాడు. ప్రతిసారి పై అధికారుల అనుమతి లభించుట కష్టము గనుక అప్పుడప్పుడు రహస్యముగా 'గైరు హాజరై' కూడ వెళ్ళేవాడు. ఆ విధముగా ఒకసారి గోదావరి నది దాటి నైజాము రాష్ట్రము వెళ్ళి తిరిగి వస్తుండగా ఈతనిపై ఈర్ష్యగల కొందరు సహోద్యోగులు నదికి ఇవతల ఒడ్డునుండి చూసి ఇతనిని పట్టుకొనుటకు సిద్ధముగా ఉన్నారు. దాసగణు ఇది గమనించి గోదావరి నదీ

జలము దోసిటిలో తీసికొని, "బాబా! నాకీ ప్రమాదము తప్పితే ఉద్యోగము విడుస్తా"నని ప్రమాణము చేసి, తిరిగి నైజాము రాష్ట్రములోకే వెళ్ళాడు.

అక్కడ ఒక గ్రామ మునసబు ఎదురై దగ్గరలోనే కొందరు దొంగలు దొంగ సొత్తు పంచుకొనుచున్నారని, వారిని అరెస్టు చేయుటకు తనకు ఒక పోలీసు ఉద్యోగి కావాలన్నాడు. దాసగణు ఆ మునసబు, గ్రామస్థుల సహాయంతో దొంగలను, దొంగ సొమ్మును పట్టుకొని నదికివతలకు వచ్చాడు. నైజాము రాష్ట్రములోకి ఎందుకువెళ్ళావు? అంటే దొంగలను పట్టుకొనుటకు వెళ్ళానన్నాడు. పాపము! అయిష్టమైనా అబద్ధమాడుట తప్పలేదు. దీని వలన శిక్ష ఏమీ పడదు, సరిగదా ప్రమోషను వచ్చుట ఖాయమనుకొన్నాడు. త్వరలోనే డ్యూటీపై శిరిడీ గ్రామము గుండా బాబాను చూడకనే గుర్రముపై వెడుతున్నాడు. ఈతని ప్రయాణము సర్వజ్ఞుడైన బాబాకు తెలియదు కనుకనా! లెండీ తోటవద్ద దాసగణుకు ఎదురైనారు. గత్యంతరము లేక గుర్రముదిగి బాబాకు నమస్కరించాడు. "గోదావరి నదీ జలము దోసిట్లో తీసికొని ప్రమాణము చేసినదెవరు" అన్నారు బాబా. "దానికేముందిబాబా! కొన్నాళ్లు సబిన్స్పెక్టరుగా పనిచేసి తప్పక ఉద్యోగము విడుస్తా" నన్నాడు. ఇంక బాబానుండి ఏమీ ఒత్తిడిలేకపోవటంతో ఎంతో సంతోషించి తన ప్రయాణము కొనసాగించాడు. కాని బాబా అంత సులభముగా విడిచిపెడతారా?

1898-99 ప్రాంతములో 'కానాభిల్లు' డనే ఒక బందిపోటు దొంగ ఉండేవాడు. ఇతని పేరు చెపితే ప్రజలకూ, ప్రభుత్వానికీ కూడ హడలు. ఇతడు బహుక్రూరుడు. ప్రజలను నిర్దాక్షిణ్యముగా చంపి దోచుకొనేవాడు. ఇతనిని పట్టుకొనుటకై ప్రభుత్వము చేసిన ప్రయత్నములేవీ ఫలించలేదు. దాసగణును, మరి ముగ్గురను గూఢచారులుగ ఇతని రాకపోకలు కనిపెట్టుటకై ప్రభుత్వము నియమించినది. వీరు యాత్రికులుగ నటిస్తూ ఒక రామాలయములో ఉన్నారు. కానాభిల్లునికి స్వంత గూఢచారు లున్నారు. ఆ గ్రామ మునసబుద్వారా వారి రాక తెలిసికొని ఆ ముగ్గురను చంపి దాసగణు మెడ పట్టుకొన్నాడు. వెంటనే ప్రక్కనేవున్న శ్రీరామ విగ్రహం పాదములు పట్టుకొని సాయిని స్మరించి తనకా ఆపద తప్పితే ఉద్యోగము తప్పక వదిలివేస్తానని ప్రార్థించాడు. అంతే! కానాభిల్లునిలో కొంత మార్పువచ్చింది. "ఈసారి నా జోలికి వచ్చావో తప్పకుండా చంపేస్తాను జాగ్రత్త" అని బెదిరించి వదిలేశాడు.

వేరొకసారి కానాభిల్లుడొక కొండ ప్రాంతములో ఉన్నాడని తెలిసికొని ప్రభుత్వమునకు తెలియచేశాడు. పెద్దపోలీసుబృందమొకటి వచ్చి ఆ కొండను ముట్టడించింది. పెద్ద పోరు జరిగింది. ఎంతోమంది పోలీసులు మరణించారు. కాని కానాభిల్లుడు పారిపోయాడు. పొరపాటున అతనికి ఎప్పుడైనా చిక్కితే చావు తప్పదని భయపడి తనకు గుండె జబ్బని ఒక డాక్టరు సర్టిఫికేటు సంపాదించి సెలవు పెట్టేశాడు దాసగణు. బాబాను ఈ రెండవసారి కూడ తెలివిగా మోసగించి తాను సురక్షితముగా ఉన్నాననుకొన్నాడు. తాననుకొంటే సరిపోతుందా?

దాసగణు హెడ్ కానిస్టేబిల్ గా పనిచేసే స్టేషనులో సబిన్స్పెక్టరు కొన్నాళ్ళు సెలవు పెట్టాడు. ఇంకేం? రొట్టెవిరిగి నేతిలో పడింది. దాసగణు కోరిక ఫలించింది. తానే ఆ స్టేషనుకు తర్వాత సీనియరు. అందుచేత స్టేషను అధికారి. తనకు సబిన్స్పెక్టరు ప్రమోషను రాకపోయినా అయినట్లుగానే భావించి ఆ హోదా వెలగబెడదామనుకొన్నాడు. "ఎవరైనా అడిగితే అయ్యగారు కేంపుకి వెళ్ళారని చెప్పు. ఇంటికివెళ్ళి ఒకటి రెండురోజులలో వచ్చేస్తా"నని తన క్రింది అధికారికి చెప్పి దర్జాగా నాందేడు వెళ్ళివచ్చాడు.

సరిగా ఆ సమయంలోనే ఒక ముద్దాయి సంబంధీకుల నుండి జరిమానాగా వసూలు చేసిన ₹32/- లు ఒక గ్రామ మునసబు ఒక 'తోటి' ద్వారా దాసగణు పనిచేసే స్టేషనుకు పంపాడు. దాసగణు 'కేంపు' వెళ్ళాడు గనుక, ఒక కానిస్టేబుల్ స్టేషన్ ఇన్-చార్జి. అయ్యగారు కేంపునుండి వచ్చిన తర్వాత రశీదిస్తానని, తానీయకూడదనీ చెప్పి ఆ సొమ్మును తీసికొని కాజేశాడు. పాపము! దాసుగణుకీ సంగతి తెలియదు. సొమ్ము ప్రభుత్వముకు అందకపోవుటచే ఆ ముద్దాయి సంబంధీకులకు రెండవసారి వారెంటు వచ్చింది. "మేము గ్రామ మునసబుకు సొమ్ము ఎప్పుడో చెల్లించా"మని ఆ మునసబిచ్చిన రశీదు వారు చూపారు. ఆయన నడిగితే 'తోటీ' ద్వారా దాసగణు స్టేషనుకు పంపానన్నాడు. మరి సొమ్ము ఏమయిందో తెలిసికొనుటకు ఒక విచారణాధికారి వచ్చాడు. ఆ సొమ్ము స్టేషనుకు పంపబడినరోజు స్టేషన్ ఇన్-చార్జి ఎవరని రికార్డు తిరగేసిచూస్తే దాసగణు! నేనేమి

*మిగతా 15వ పేజీలో*

# 'భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి'

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

ప్రతి మానవుడు ఎక్కడో ఒక చోట, ఎవరికో ఒకరికి ఏదో ఒక పరిస్థితిలో పుడుతూ వుంటాడు. ప్రతివారూ ఏదో ఒకరకమైన అవయవ నిర్మాణంలోనూ, ధనికుల కుటుంబంలోనో లేక దారిద్ర్యపు కుటుంబంలోనో, మరేదో వివిధ స్థితిగతులలో వున్న కుటుంబాలలోనో జన్మిస్తూ వుంటారు. జన్మించిన ప్రతి మానవుడూ సుఖదుఃఖాలను అనుభవిస్తూ వుంటాడు. ఎంతటి ధనవంతుడికైనా కొన్ని దుఃఖపడే పరిస్థితులు వుంటాయి. అలాగే కటిక దరిద్రుడికైనా సంతోషకరమైన పరిస్థితులు వుంటాయి. అయితే ఎవరూ కూడా అవి వచ్చినపుడు వాటిని అనుభవించి వూరుకోరు. కష్టం కలిగినపుడు ఆ కష్టాలనుంచి తప్పుకోవాలని, సుఖాలు కలిగినపుడు యింకా యింకా సుఖపడాలని కోరుకుంటూనే వుంటారు. ఇది మానవ సహజగుణం. అయితే 'భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండాలి' అంటే ఏమిటి? మనలను ఆయన ఎలా వుంచితే అలానే వుంటున్నాము గదా! వుండక ఏంచేస్తాం? తప్పక వుండవలసిందే అనవచ్చు. అంటే మనకు ధనము-దారిద్ర్యము, ఆరోగ్యము-అనారోగ్యము, మన సంతానము, జీవితంలో సంభవించే అనేక సంఘటనలు; ఇలా ఏవి ఎలా ప్రాప్తిస్తే అలా వుండక తప్పదు గదా! మరి మనం భగవంతుడు ఎలా వుంచితే అలాగే వుంటున్నాం గదా! అని మనకనిపించవచ్చు. ఈ విషయాన్ని గూర్చి స్వంత విశ్లేషణకంటే పూజ్యశ్రీ మాస్టరుగారి ఆచరణ చూస్తే మనకు చక్కగా అవగతమవుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఆధ్యాత్మిక జీవితానికి అంకితమవకముందే ఆయన అలాంటి స్థితిలో వున్నారని మనకు తెలుస్తుంది. తండ్రిగారి అనారోగ్యం వల్ల యింటి ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పుడు ఆయన ఒకే ఒక నోట్-బుక్(note book) తో M.A. పూర్తి చేసారు. ఇస్త్రీ లేని, చేతితో ఉతికిన పాంటు చొక్కాలతో క్లాసుకు వెళ్ళారు. హాస్టల్ లోని గాడిపొయ్యిలోని మసితో పండ్లు తోముకున్నారు. స్నాన సమయంలో ఇసుకతోనూ, కేవలం ఒట్టి చేతులతోనూ ఒళ్ళు రుద్దుకున్నారు. వేడివలన నోరుపొక్కి ఏమి తినలేక పోతున్నప్పటికీ తినగలిగేవాటి కోసం ఆయన ఆరాట పడలేదు. అలానే ఏమీ తినకుండా వుండిపోయేవారు. బ్రహ్మచారిగా వుండగా ఆయన ఎన్నో అపవాదులను ఎదుర్కొన్నారు. జీవితంలో యివి సహజమంటూ వాటిని చిరునవ్వుతో దాటవేసారు.

సం.1963లో శ్రీ సాయినాథుని అనుగ్రహం పొందాక ఆయన స్థితి అతీతమైనదే అయినప్పటికీ సామాన్య మానవుని వలె ఆయన అనేక క్లిష్ట పరిస్థితుల నెదుర్కొన్నారు. ప్రజలు బాబా భక్తునిగా ఆయనకు నీరాజనాలర్పించినప్పటికీ ఆయన పొంగిపోలేదు. మరొకవంక దొంగస్వామిగా ఆయన గురించి ప్రచారమైనప్పటికీ ఆయన కృంగిపోలేదు. ఎక్కడికైనా కాలినడకన వెళ్ళవలసి వచ్చినా, కారులో వెళ్ళవలసి వచ్చినా ఆయన ఒకే విధంగా

స్పందించారు.

ఇంట్లోని పరిస్థితులు, కుటుంబ ఆర్థిక పరిస్థితి కష్టంగా వున్నప్పటికీ, తమవల్ల ఎంతో మేలు పొందినవారిని గాని, తమవలన ఆర్థిక సహాయం పొందినవారిని గాని, లేక తమను గురువుగా భావించి తాము కోరితే ఎంతైనా సహాయం చేయగలిగిన వారిని గాని ఆయన అర్థించలేదు. నిబ్బరాన్ని కోల్పోలేదు.

ఆయన మొదట ఒంగోలులో లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరారు. రెండవ అన్నగారి కోరికపై ఆ ఉద్యోగం మానేసి I.A.S పరీక్షకు చదివారు. తర్వాత హైదరాబాద్ లోని వివేకవర్ధని కాలేజీలో పనిచేసారు. తర్వాత అది గూడ మానేసి బాపట్లలోని కాలేజిలో పనిచేసారు. తర్వాత ఆ ఉద్యోగము వదిలేసి జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో కొంతకాలమున్నారు. అక్కడి నుంచి తిరిగి నెల్లూరు జిల్లా విద్యానగర్ కాలేజిలో చేరారు. ఆయన కాలేజీ మారి మరొక కాలేజీలో చేరిన ప్రతిసారీ సీనియర్ గా కాక జూనియర్ గా తక్కువ జీతంతో చేరవలసి వచ్చేది. కారణాలు ఏమైనప్పటికీ వివిధ కాలేజీలు మారవలసి వచ్చినా ఆయన కొంచెంకూడా బాధపడలేదు.

విద్యానగర్ లో ఆయన బాబా ప్రచారం చేపట్టి సాయిబాబా మందిరాన్ని నిర్మించారు. తర్వాత అక్కడ ఏర్పడిన క్లిష్ట పరిస్థితుల వల్ల ఆ ఉద్యోగమూ వదిలేయడమేగాక ఆ ఊరు వదిలి ఒంగోలు రావలసి వచ్చినా ఆయన చలించలేదు. బాబాపై కించపడలేదు. కనీసం ఎందుకిట్లా చేసారని బాబాను ప్రశ్నించలేదు. అంతా బాబా సంకల్పంగా ఆయన భావించారు. అపనిందలను సంతోషంగా స్వీకరించారు. సన్నిహితులు తప్ప ఆయనను చూసిన వారికెవరికీ ఆయన కష్టాలలో వున్నట్లే తెలిసేది కాదు. తన కష్టాలను ఎవరికీ తెలియనీయక తాము ఆనందంగా వుంటూ అందరికీ ఆనందాన్నందించారు.

ఒక ప్రక్క దేశవిదేశాలలో ఎందరో ఆయనను ఎంతగానో కీర్తిస్తున్నారు. మరొక ప్రక్క అసూయాద్వేషాలతో కొందరు విమర్శిస్తున్నారు. ఆయనకు నిందలు వచ్చినపుడు వాటిని తొలగించుకోవడానికి ప్రయత్నించలేదు. అపనిందలు వేసిన వారిని నిందించనూ లేదు, దండించనూ లేదు. ఎవరైనా తమను కీర్తించినపుడు ఆ కీర్తిని పెంచుకోవడానికి ప్రయత్నించలేదు. కీర్తించినవారిని ఆకాశానికెక్కించనూ లేదు. ఆయన యిలా అనేవారు: "వారు పొగిడేదీ, విమర్శించేదీ వారి భావాలనే!" అని .

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని ఒకరిలా ప్రశ్నించారు: "మాస్టారూ! మీరు ఒంగోలులో స్థిరపడినట్లేనా?" అని. అప్పుడాయన చెప్పిన సమాధానమిది. "అదేమీ లేదయ్యా! బాబా ఎక్కడ వుంచితే అక్కడే!"

సుఖాలు వచ్చినపుడు చేసే 'ఆహా' అనే శబ్దాలూ, కష్టాలు కలిగినపుడు చేసే హాహాకారాలూ – రెండూ భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండలేకపోవడానికి సంకేతాలే. ఎటువంటి పరిస్థితులలోనైనా పొంగక, కృంగక ఒకేరకంగా వుండగలగడమే భగవంతుడు ఎలా వుంచితే అలా వుండడమంటే!

"ఇవన్నీ మనకు తెలిసిన విషయాలే గదా! మళ్ళీ చెప్పుకోవలసిన అవసరమేమున్నది?' అనిపించవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారి విషయాలు ఎన్నిసార్లు చెప్పుకున్నా తనివి తీరదు. అంతేగాక వాటిని స్మరించుకోవడం వల్ల మనలను మనం యింకా యింకా సరిదిద్దుకోవడానికి అవకాశముంటుంది.

అయితే మనమేం చేయాలి? ఆయన గొప్పతనం గూర్చి చెప్పుకుని ఆనందిస్తూ వుండడమేనా? అంతే అయితే ఆయన మన మధ్యకు ఎందుకు వచ్చినట్లు? ఎందరికో ఆర్థిక బాధలను తీర్చిన ఆయన తమ ఆర్థిక యిబ్బందులను తొలగించుకోలేరా? ఎందరి క్లిష్ట సమస్యలను తమ అమూల్య సలహాలతో అవలీలగా నివారింపజేసిన ఆయనకు తమ సమస్యలొక లెక్కా? సర్వ సమర్థులైన సాయినాథుని సంపూర్ణంగా విశ్వసించిన ఆయనకు దేనికైనా కొరత రావలసిన అవసరమేమున్నది? అయితే ఆయన ఎందుకు అలా జీవించారు? దానికి ఒక్కటే సమాధానం – అలా వుండడాన్ని మనకు నేర్పడానికి మాత్రమే! ఆయన కాబట్టి అలా వుండగలిగారు. సామాన్యులమైన మనమలా ఎలా వుండగలము? అని కొట్టిపారేయడానికి మాత్రం కాదు. అలా వుండవచ్చు అని తెలియజెప్పడానికోసమే. అందుకని మనంగూడా 'ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన' పడకుండా భగవంతుడు మనలను ఎలా వుంచితే అలా వుండడానికి ప్రయత్నించాలి. అలా చేసినప్పుడే మనం ఆయనను సంతోషపెట్టిన వారమవుతాము. అదే పూజ్యశ్రీ మాస్టరుగారికి మనమిచ్చే నిజమైన దక్షిణ!

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## ఏడవ ప్రసంగము

### జనసమూహపు బుద్ధి రజస్తమోమయము

సురావిక్రీయతే స్థానే దధి క్షీరం గృహే గృహే - ఇలానే మద్యము నిషిద్ధమైన పదార్థము అయినందువలన ఎక్కువ ఖరీదుకు అమ్మబడుతుంది. దానిని సేవించడానికి చాలామంది అమ్మేచోటికి వెళ్ళి, త్రాగి మత్తువలన ఆనందాన్ని అనుభవిస్తారు. అదేవిధంగా పైన చెప్పిన గాయకిని మీరాబాయి అవతారంగా భావించి ఎంతో మంది ప్రజలు వెళ్ళి, అసత్యపు భగవంతుని దర్శనపు ఆనందాన్ని అనుభవించారు. పాలు, పెరుగు ఉత్తమపదార్థాలు అయినప్పటికీ అవి తక్కువ వెలకు అమ్మబడుతాయి అమ్మేవాళ్ళు వాటిని ఇంటింటికీ తీసుకుని వెళ్ళి అమ్ముతారు. కబీరు పూర్ణజ్ఞాని, దేహాభిమానం లేనివాడు. ఎవరేమి అనినా లెక్కపెట్టకుండా ఓర్పుగా ప్రవర్తించేవాడు. కానీ అజ్ఞానులు దేహాభిమానంతో నిండినవారై పైన చెప్పిన మీరాబాయిలాగా తమ పరువు ప్రతిష్ఠలను ఇతరులచేత అంగీకరింపజేసికోడానికి శ్రమపడతారు.

ప్రపంచంలో సూక్ష్మబుద్ధికలవారు కొద్దిమంది మాత్రమే వుంటారు. చాలామంది సామాన్యులే వుంటారు. కాబట్టి సదసద్వివేకము తేలికైనది కాదు. ఇందులో ఎవరి తప్పులేదు. సామాన్యముగా ప్రజల బుద్ధి రజస్తమో గుణాలతో నిండి వుంటుంది. కాబట్టి సత్యాన్ని తెలిసికోవడం సామాన్యము కాదు. ఇది కలియుగ ప్రభావము. బృహన్నారద పురాణంలో ఇలా ఉన్నది - "అధర్మలోలుపాః సర్వే", కలియుగంలో అందరూ అధర్మాన్నే ప్రేమిస్తారు. "వ్యాజధర్మరతాస్సర్వే", అందరూ ధార్మికులుగా కనిపించడానికే ప్రయత్నిస్తారు, "విద్యాగ్రహణ శూన్యత్వాదధర్మో వర్తతే పునః", విద్యను గ్రహించే శక్తి లేకపోవడం వలన అధర్మం ప్రచారంలో వుంటుంది. ఈ కారణాల వలన వేదశాస్త్రాధ్యయనము

జరుగకపోవడం వలన ధర్మాధర్మ విచక్షణా శక్తి కలుగక జనులు అధర్మప్రవర్తకులు అవుతారు.

ఇద్దరు రత్నాల వ్యాపారులు వుండేవారు. వారిద్దరికీ ఎంతో స్నేహము. కాలాంతరంలో వారిలో ఒకరికి వ్యాపారంలో నష్టమొచ్చింది. ఆ దెబ్బతో అతడు కొద్దికాలంలో మరణించాడు. భర్త మరణించడం వలన అతని భార్య ఎంతో దుఃఖించింది. రోజు గడిచే పరిస్థితి లేదు. నగలు అమ్మి రోజులు గడుపుతూవున్నది. అలా 10,15 సం॥లు గడిచాయి. కుమారుడు 18 సం॥ల వాడయ్యాడు. ఆమె తన కుమారుడికి రెండు వజ్రాలు ఇచ్చి తన భర్త స్నేహితుడైన రత్నాల వర్తకుడి దగ్గరకు వెళ్ళి ఇలా చెప్పమన్నది "ఈ రెండు వజ్రాలకు ఖరీదు కట్టి మాకు ధనం ఇస్తే కొద్దిరోజులు గడుస్తాయి."

కుమారుడు వజ్రాలను తీసుకుని వెళ్ళాడు. వర్తకుడు పరీక్షించాడు. అవి నకిలీ వజ్రాలు, అసలు వజ్రాలు కావు. కానీ ఆ సంగతి పైకి చెప్పలేదు. "వీటిని ప్రస్తుతము మీ దగ్గరే వుండనివ్వండి. మా దగ్గర రత్నపరీక్ష నేర్చుకో. ముందు ముందు నీకు ఉపయోగకరంగా వుంటుంది. నేను నెలకు 25రూ॥లు ఇస్తాను. వాటితో నీవు, నీ తల్లి సుఖంగా కాలం గడపండి."

బాలుడికి ఆ మాటలు నచ్చాయి. తల్లి కూడా అది విని సంతోషించింది. అప్పటినుండి 5,6 సం॥లలో అతడు రత్నపరీక్షను పూర్తిగా నేర్చుకున్నాడు. అప్పుడు రత్నవర్తకుడు అతని దగ్గరవున్న ఆ వజ్రాలను తెప్పించి పరీక్షించమని అతనికి ఇచ్చాడు. కుమారుడు పరీక్షించి అవి నకిలీవి అని చెప్పాడు.

వర్తకుడు :సరిగ్గా చూడు, నీ తండ్రి గొప్ప రత్నవర్తకుడు. అతడు నకిలీ వజ్రాలను తన దగ్గర ఉంచుకోడు.

కుమారుడు అతి జాగ్రత్తగా పరీక్షించి అవి నకిలీ వజ్రాలేనని చెప్పాడు. అప్పుడు ఆ వర్తకుడు ఇలా అన్నాడు: "నీవు నా దగ్గరకు ఈ వజ్రాలను తీసుకుని వచ్చినప్పుడే ఇవి నకిలీవి అని నేను చెప్పివుంటే మీ అమ్మ, నీవు ఏమి అనుకుంటారు? ఇప్పుడు నీకు, పూర్తిగా రత్నపరీక్ష తెలిసినది. కనుకనే నీ ఇంటిలో దాచివుంచిన వజ్రాలు నకిలీవని తెలుసుకోగలిగావు."

ఇలానే శాస్త్రజ్ఞానం ద్వారా నిజమైన ధర్మము తెలియనంత వరకూ తమ అజ్ఞానానికి సరైనవని తోచే పనులనే ధర్మకార్యాలుగా మానవులు తలుస్తారు. ధర్మకార్యాలను తెలిసికోడానికి శాస్త్రాలు చదవాలి.

ఇంతలో దర్బారులోనుండి ఒకరు వచ్చి నిత్యానందులవారితో ఇలా అన్నారు - ప్రకాశానందస్వామివారు జునాగఢ్ వెళ్ళవలసివున్నది. వారి దగ్గర కప్పుకోడానికి చినిగిన బొంతమాత్రమే వున్నది. ఇది చలికాలం కాబట్టి అంతఃపురములోనుండి విలువైన రజాయి పంపారు.

## ఆశ కలవాడు దరిద్రుడు

ఈ మాటలు విని నిత్యానందులు ఇలా అన్నారు

ఒక అరణ్యంలో ఒక మహాత్ముడు బొంత కప్పుకుని వున్నాడు. దానికి పెద్ద పెద్ద చినుగులు వున్నాయి. ఒక రాజుగారు ఆ సమయంలో పెద్ద సైన్యంతో ఆ మార్గంలోనే వెళుతూవున్నారు. వారు ఆ మహాత్ముడిని చూశారు. కప్పుకోడానికి సరైన బట్ట లేకపోవడం చూసి వజ్రవైడూర్యాలలో అలంకరింపబడిన తన శాలువాను తీసుకొని రమ్మని సిపాయిని ఆజ్ఞాపించాడు. సిపాయి శాలువా తెచ్చి ఆ మహాత్ముడి దగ్గర ఉంచాడు. "ఒరే, ఇదిగోరా, నీ అదృష్టం పండింది. మా మహారాజుగారు నీ మీద దయగలిగి రెండు మూడు లక్షల రూపాయలు విలువగల శాలువాను బహుమతిగా ఇచ్చారు" అన్నాడు.

మహాత్ముడు - దరిద్రునికి ఎవరికైనా ఇవ్వండి

సిపాయి - ఓరి సన్యాసీ! నీకేమైనా మతిపోయిందా?

ఆ మహాత్ముడు మాత్రం శాలువా తీసికోలేదు. అప్పుడు సిపాయి రాజు దగ్గరకు వెళ్ళి, "ఆ సన్యాసి వెర్రివాడిలాగా వున్నాడు. శాలువా తీసికోవడం లేదు. పేదవాడికి ఎవరికైనా ఇవ్వమని అంటున్నాడు" అన్నాడు.

"ఈయన పేదవాడనే గదా శాలువా ఇస్తున్నాను?" అనుకొని ఆయన దగ్గరకు మహారాజు వచ్చి అడిగాడు -

"స్వామీ! చలి చాలా వేస్తోంది. మీ వద్ద ఏమీ లేదు, ఈ శాలువా కప్పుకోండి!" అని చెప్పాడు.

మహాత్ముడు : పేదవాడికెవరికైనా ఇవ్వు.

మహారాజు : దరిద్రుడంటే ఎవరు?

మహాత్ముడు : నువ్వు ఎవరివి?

మహారాజు : నేను ఈ దేశపు రాజుని.

మహాత్ముడు : నీవు ఎక్కడికి వెళుతున్నావు?

మహారాజు : యుద్ధము చేయడానికి వెళుతున్నాను.

మహాత్ముడు : యుద్ధము ఎందుకు చేస్తున్నావు ?

మహారాజు : రాజ్యాన్ని విస్తరించడానికి.

మహాత్ముడు : నీ ఆదాయం ఎంత?

మహారాజు : మూడు కోట్లు.

మహాత్ముడు : ఇంకా నీ ఆశ తీరలేదా? నీవు యుద్ధంలో తప్పకుండా జయిస్తానని నమ్మకం ఏమిటి? నీవే యుద్ధంలో చనిపోతే ?...

భర్తృహరి మహారాజు ఇలా చెప్పారు:

*శ్లో॥ వయమిహ పరితుష్టా వల్కలైస్త్వం చ లక్ష్మ్యా*
*సమ ఇహ పరితోషో నిర్విశేషో విశేషః ।*
*స తు భవతు దరిద్రో యస్య తృష్ణా విశాలా*
*మన సి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః ॥*

భావం : మాకు ఈ నారబట్టల వలన కలిగే సంతోషమే మీకు ధనం వలన కలుగుతుంది. సంతోషం రెండింటిలోనూ సమానమే. భేదమేమీ లేదు. పేరాశ కలవాడే దరిద్రుడు. మనసుకు సంతోషం కలిగినపుడు దరిద్రుడెవరు? ధనవంతుడెవరు?

ఇలా ఆ మహాత్ముడు రాజును దరిద్రుడిగా నిరూపించాడు. అప్పుడు ఆ రాజు సైన్యాన్ని వెనుకకు పంపి ఆ మహాత్ముడి సాంగత్యంలో కొంతకాలం వుండి, ఉపదేశాలను స్వీకరించి వెనుకకు వెళ్ళిపోయాడు. మంచిచెడ్డలు మన దృష్టిని బట్టి ఉండును. స్వామివారికి చలిసోకకుండా జాగ్రత్తపడడమే కావలసినది. మురికిదో చినిగినదో – ఏదో ఒకటి. అదే స్వామివారికి గొప్పది.

అప్పుడు ప్రకాశనందస్వామివారిని జూనాగఢ్ పంపడానికి ఏర్పాట్లు జరిగాయి.

**ఏడవ ప్రసంగము సమాప్తము.**

## రాని హోదా వెలగబెడితే...
## ...ఉన్న ఉద్యోగం ఊడింది

10వ పేజీ తరువాయి

ఎరుగను లబోదిబో అంటే ఎవరు వింటారు? గవర్నమెంటు సొమ్ము. ఆరోజు తాను డ్యూటీలోనే ఉన్నానంటే సొమ్ము తానే తీసికొన్నట్లు ఒప్పుకోవాలి. తాను తీసికోలేదంటే తాను లోపాయకారీగా 'కేంపు' వెళ్ళానని ఒప్పుకోవాలి. తన గుట్టు బయటపడుతుంది. ఇది యింకా ప్రమాదం. నిజం చెప్పినా అబద్ధము చెప్పినా ప్రమోషను మాట దేవుడెరుగు, జైలు శిక్ష ఖాయం. బాబా మెడకు త్రాడు బిగించారు. గతంలో తనను రెండుసార్లు కాపాడిన బాబా మళ్ళీ జ్ఞాపకము వచ్చారు. "బాబా! నన్నీ ఒక్కసారి కాపాడు. ఇప్పుడే రాజీనామా చేస్తా" అని ప్రార్థించాడు. దాసగణు నిజాయితీ ఆ విచారణాధికారికి కూడ తెలుసు. ఎలాగైనా అతనినీ రొంపిలోంచి లాగుదామని ఆ అపరాధపు రుసుము ₹32/-లు దాసగణు చేత కట్టించి అతనిచే ఉద్యోగమునకు రాజీనామా చేయించి, ఈ గొడవ సర్దుబాటు చేశాడు. ఇది 1903 లో జరిగింది.

బాబా ఈ విధముగా ఆధ్యాత్మికౌన్నత్యమునకు అవరోధమైన ఉద్యోగము నుండి దాసగణుకు విముక్తి ప్రసాదించారు. దాసగణు విచారంతో శిరిడి చేరి బాబాను దర్శించాడు. బాబాతో "నా ఉద్యోగం వదులుకొన్నాను. నాకు ఆస్తిపాస్తులు లేవు. ఇంక నా భార్య, నేను వీధిన పడవలసినదేనా?" అని వాపోయాడు. బాబా "గణూ! నీవెందుకు బాధ పడతావు? నీవు నాందేడులో ఉండు. నేను నీకన్నము పెడతా" నన్నారు. సత్యవచనుడైన బాబా మాట లెలా పొల్లుపోతాయి? ఒక స్నేహితుడు మంచి పొలమును చౌక ధరకు దాసగణు కమ్మాడు. అతని కీర్తనలు, హరికథలే ఆతనికి జీవనము నిచ్చాయి. ఎక్కడ హరికథ చెప్పినా ప్రజలు తండోపతండములుగా చేరేవారు. హరికథ పూర్తిచేసి "అటువంటి సగుణ బ్రహ్మమును మీరు ప్రత్యక్షముగా చూసి తరించదలచారా? శిరిడీ వెళ్ళండి సాయిబాబా రూపములో ఉన్నారు. ఇదుగో" నని సాయి పటము చూపేవాడు. అంతే! ప్రజలు మంత్రముగ్ధులై శిరిడీవెళ్ళి సాయినాథుని దర్శించేవారు. దాసగణు తన జీవితమంతా సాయిభక్తి ప్రచారమునకే వినియోగించాడు. ఈ విధముగా బాబా పైకి కష్టములుగా కన్పించే సంఘటనలు కల్పించి దాసగణును ఎంతో శ్రేయోదాయకమైన మార్గమున పయనింపజేసారు.

# మాతృదేవి స్మృతులు

*డాక్టర్ సౌజన్య*

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కి జై
శ్రీ సచ్చిదానంద సద్గురు అలివేలుమంగమ్మ సహిత భరద్వాజ మహారాజ్ కి జై

నా పేరు సౌజన్య. నాకు పూజ్యశ్రీ అమ్మగారు మా అమ్మ (శ్రీమతి అరుణ) ద్వారా పరిచయం అయ్యారు. మా అమ్మ తరచుగా అమ్మగారి దగ్గరకు వెళ్తుండేది. నేను అప్పుడప్పుడు వెళ్ళేదాన్ని. మా అమ్మ మాస్టరు గారి గ్రంథాలు పారాయణ చేసేది. అట్లా నాకు బాబా పారాయణ, గుడికి వెళ్ళడం అలవాటయ్యాయి.

2006లో నేను MBBS పూర్తి చేసాను. అమ్మగారు అక్కల్‌కోట యాత్రకు వెళ్ళారు సత్సంగసభ్యులతో. అప్పుడు సులోచన ఆంటీ నాకు ఫోన్ చేసి "నువ్వు డాక్టర్‌వి కదా, వస్తే బాగుంటుంది. అమ్మగారు పర్మిషన్ ఇచ్చారు" అని అన్నారు. అమ్మతో చెప్తే, "వెళ్ళు మంచిదే కదా!" అంటే అలా అమ్మగారితో నేను అక్కల్‌కోట వెళ్ళాను. నాకు మొదటిసారి అమ్మ లేకుండా ఎక్కడికైనా అదీ తెలియని వాళ్ళతో వెళ్ళడం. కానీ అక్కడ అమ్మగారు నన్ను చూచుకున్న తీరు నన్ను ఆశ్చర్యానందాలలో ముంచివేసింది. అమ్మ తోడు లేకుండా ఎక్కడికి వెళ్ళని నాకు పూజ్యశ్రీ అమ్మగారు మా అమ్మ గుర్తు రాకుండా చేసారు. అంతటి ప్రేమను కురిపించారు. అలా అమ్మగారితో పరిచయం ఏర్పడింది. తర్వాత వేదక్క, ద్వారక బాబుగార్లతో కూడా పరిచయం ఏర్పడింది. ఈ యాత్రలో నన్ను అమ్మగారు అనుగ్రహించిన లీల – నేను సెలవు పెట్టకుండా వెళ్ళాను. చాలా కఠినంగా వున్నదని చెప్పారు స్నేహితులు. కంగారు పడ్డాను. కాని Attendence register miss అవ్వడం వల్ల ఏమి ప్రాబ్లమ్ కాలేదు. అమ్మగారు ప్రేమ స్వరూపిణి.

తర్వాత నేను వీలయినంతవరకు అమ్మగారి దగ్గరకు వెళ్ళేదాన్ని. 2009 ఫిబ్రవరిలో నా పెళ్ళి అమ్మగారి ఆశీస్సులతో జరిగింది. నా వైవాహిక జీవితంలో వచ్చిన ఎన్నో ఒడిదుడుకులను అమ్మగారు సరిచేసారు. నాకు మొదటిసారి గర్భం వచ్చినప్పుడు నాకు షుగర్ వచ్చిన విషయం చాలా లేట్‌గా తెలియడం వల్ల మందులు తీసుకోలేకపోయాను. కానీ అమ్మగారి దయవల్ల నాకు ఎటువంటి ఇబ్బంది కల్గలేదు.

2015 మే నెల లో నాకు బాబు పుట్టాక అనుకోకుండా పూజ్యశ్రీ అమ్మగారు నాకు తమ సేవను ప్రసాదించారు. అమ్మ దగ్గర వుండడం వల్ల చేసుకోగలిగాను.

పూజ్యశ్రీ అమ్మగారు నన్ను ఘోరమైన ప్రమాదాల నుండి రక్షించారు. 2017 మే నెల లో నేను హాస్పిటల్ డ్యూటీ తరఫున వేరే వూరుకు వెళుతున్నాను. నాకు నిద్ర తూగింది. ఒక్కసారిగా ఏం జరిగిందో తెలియదు. వెనక సీట్‌లో వున్న నేను డ్రైవర్ ప్రక్క సీట్‌లో పడ్డాను. కళ్ళు తెరిచి చూస్తే డ్రైవర్ కార్‌ను ఆగివున్న టిప్పర్‌కు గుద్దాడు. కార్ నుజ్జు నుజ్జు అయ్యింది. నాకు చెవిలో నుండి రక్తం కారడం తెలుస్తుంది. నేనెక్కడున్నానో ఏమైందో తెలియలేదు. నెమ్మదిగా చూసుకుంటే కార్‌కు యాక్సిడెంట్ అయినదని అర్థమయింది. ప్రాణాలు పోయేంత ప్రమాదం జరిగింది. కారును చూస్తే ఎవరు కూడా అందులోని వాళ్ళు బ్రతికివున్నారనుకోరు. డ్రైవర్‌కు ఏమీ

కాలేదు. నాకు చెవిలోపల వైపు చాలా బలంగా తగిలింది. ఇంకొంచెం గట్టిగా పడి వుంటే నేను అక్కడే పోయేదానినని డాక్టర్ చెప్పాడు. అమ్మగారు ఎంత ప్రమాదం నుండి రక్షించారు. ఇంకోసారి మార్చి 2021లో నేను బండి మీద హాస్పిటల్ డ్యూటీకి వెళ్తున్నాను. వెనుక నుండి వచ్చే బస్‌ను తప్పుకుందామని ప్రక్కకు ఏమిలేకుండా చూసుకుని జరిగాను. కానీ నా ప్రారబ్ధం, చాలా స్పీడ్‌గా ఒక బండి వచ్చి గుద్దేయటం, నేను పడిపోయి నా బండితోపాటు రోడ్డు మీద కొంత దూరం వరకు ఈడ్చుకుపోవడం జరిగింది. అస్సలు బ్రతికి బయటపడే ఛాన్స్ లేదు. కొద్ది గాయాలతో బయటపడ్డాను. అమ్మగారు ఇలా అడుగడుగునా నన్ను ప్రాణాపాయాల నుండి రక్షిస్తూనే ఉన్నారు. అమ్మగారు మీకు శతసహస్రకోటి పాదాభివందనాలు.

మే 11 2021న ద్వారక బాబుగారు ఫోన్ చేసి వీలయితే రమ్మన్నారు. పూజ్యశ్రీ అమ్మగారికి సెలైన్ పెట్టడానికి. నాకు బండి లేదు అని చెప్తే బాబుగారే కారు పంపించారు. 11న వెళ్ళాను. అమ్మగారు నాకు తమ దర్శనం ఇవ్వడానికి మాత్రమే పిలిచినట్టుగా అనిపించింది. మే 26న వేదక్కయ్య ఫోన్ చేసారు. అమ్మగారిని ఒక్కసారి చూడడానికి రాగలవా అని అడిగారు. ఆ మర్నాడు వెళ్ళాను. అమ్మగారికి సేవ చేసుకునే అదృష్టం కలిగింది. ఆ రోజంతా మొత్తం పూజ్యశ్రీ అమ్మగారు తమ సన్నిధిని, సేవను ప్రసాదించారు. తర్వాత జరిగింది చూసుకుంటే నన్ను అందుకే రోజంతా వుంచుకున్నారనిపించింది. ఎందుకంటే నేను పూజ్యశ్రీ అమ్మగారితో మాట్లాడడం అదే చివరిసారి. ఆ ముందు రెండు రోజులు అసలు బాగా లేదు అన్నారు. కాని నేను బాధపడతాననేమో ఆ రోజు "కాస్త బాగున్నట్టు ఉంది" అన్నారు.

30 మే రాత్రి అక్కయ్య 11 గంటలకు ఫోన్ చేసి రమ్మన్నారు. నేను రాలేకపోతున్నాను అంటే "నీ యిష్టం" అన్నారు. అంత మంచిగా చెబితే పోలేని దుస్థితికి నాకు చాలా దుఃఖం వచ్చింది. ఏం చేయాలో కూడా అర్థం కాలేదు. సరే అయితే నర్స్‌ని పంపడానికి ప్రయత్నించమన్నారు. ప్రయత్నించాను. అమ్మగారి అనుగ్రహంతో మరుసటి రోజు ఉదయానికి ఒక నర్స్ దొరికింది. నేను పోలేకపోతున్నందుకు బాధపడ్తున్నాను అని ఇంట్లో నుంచి చేసుకునే సేవను అనుగ్రహించారు. నాకు బాబా దగ్గర అబ్దుల్లా గుర్తుకు వచ్చాడు. బాబా పిలవగానే వెళ్ళలేకపోవడం వల్ల ఆయన ఆఖరి క్షణాల్లో చూడలేకపోయాడు. నా పరిస్థితి అలాగే వుంది. పోలేకపోతున్నాననిపించగానే యిదే గుర్తుకు వచ్చింది. అదే నిజమయ్యింది. కాని అమ్మగారు ఎంత దయామయులో నాకు ఇంట్లో నుంచి అయినా సేవ చేసుకునే భాగ్యాన్ని ప్రసాదించారు.

జూన్ 3న పూజ్యశ్రీ అమ్మగారు పూజ్యశ్రీ మాస్టరుగారిలో ఐక్యమయ్యారని తెలిసింది. (మధ్యాహ్నం 1:12గం.లకు) వినగానే కుప్పకూలిపోయాను. చివరి దర్శనం కోసం మేము అమ్మగారి నిలయం వద్దకు వెళ్ళాము. దుఃఖం ఆపుకోలేకపోయాను. బాబుగారు, అక్కయ్య, లయమ్మ, మిగతా అందరూ (అమ్మగారి దగ్గర ఉన్నవాళ్ళు) నన్ను ఓదార్చారు. నేనేమీ చేయకపోయినా అక్కయ్య నన్ను "నువెంతో బాగా సేవ చేసుకున్నావు" అన్నారు.

బాబుగారు నాకు ఒంగోలు రావడానికి Permission ఇవ్వడమే కాక నన్ను అమ్మగారి వాహనంలో రమ్మన్నారు. ఇక అక్కడ్నించి పూజ్యశ్రీ అమ్మగారి సమాధి చేరే వరకు పూర్తి సేవను అనుగ్రహించారు. అక్కయ్యకు, బాబుగారికి శతకోటి ప్రణామాలు.

అసలు నిజం చెప్పాలంటే మన కోసం అమ్మగారు సేవను Create చేసి, దాన్ని మనము చేసుకునేలా కూడా వారే ఏర్పాటు చేసి, మనల్ని అనుగ్రహిస్తారు. నాకు మాత్రం చాలా విచిత్రంగానే వుంటుంది, ఎందుకంటే నేను ఏమీ చేయలేను. పరిస్థితులు కూడా అందుకు సహకరించవు. కాని అమ్మగారు పరిస్థితులను మారుస్తూ అన్ని సమకూరుస్తూ నన్ను అనుగ్రహించారు.

'అడగకుండా తల్లి కూడా అన్నం పెట్టదు' అంటారు. కాని అమ్మగారు అడగకుండా ముందుగానే అన్ని ఇస్తారు. ఇది కావాలి అని ఆలోచన కూడా రాకముందే అది నెరవేరుస్తారు.

*అమ్మగారూ!*
*మిమ్మల్ని ఎంతని వర్ణించనమ్మా.*
*ప్రేమ స్వరూపిణి, ప్రాణదాతా*
*తలచిన వెంటనే పలికే దైవం అన్నీ మీరే!*
*ఇక్కడ పొందిన జీవితం,*
*ఇంక ఎక్కడ పొందలేదు అమ్మగారు!*

జై సాయి మాస్టర్ !!

# మోక్ష ప్రదాత

*శ్రీ దత్త పాదుకా శ్రీనివాసులు*

## (అతి చిన్న వయస్సులోనే ఆధ్యాత్మిక పురోగతికి కావలసిన శిక్షణను అందుకున్న ధన్యజీవి.)

నా పేరు శ్రీనివాసులు. దత్త పాదుకా శ్రీనివాసులు అని పిలుస్తుంటారు. శ్రీ మాస్టర్ గారిని మొట్టమొదటిసారిగా 1978, 79 ప్రాంతంలో సూళ్ళూరుపేట వచ్చినపుడు చూసాను. వారు అక్కడ ఆర్యవైశ్య కళ్యాణ మంటపములో వచ్చివున్నారు. నేను అక్కడ ఒక మందిరంలో వుంటుండేవాణ్ణి. అపుడు నాకు 10, 12 సం॥ల వయస్సు, చాలా చిన్నవాణ్ణి. మాస్టరుగారి దగ్గర కెళ్ళినప్పుడు సిగరెట్ తాగుతున్నారు. మాస్టరుగారు, "ఇలారా" అని పిలిచి, "ఏంచేస్తున్నావు" అన్నారు. "ఇక్కడ పనిచేస్తున్నాను" అన్నాను. మాస్టరుగారు విభూతి పెట్టారు. పెట్టి, "ఏమన్నా అడుగుతావా" అన్నారు. 'నేనేమి అడిగేది లేదు' అని చెప్పాను. ఎందుకంటే అసలు ఆయన గురించి నాకేమీ తెలియదు. "సరే మంచిది" అన్నారు. తర్వాత నా ఆర్థిక పరిస్థితుల వల్ల సూళ్ళూరుపేట నుంచి నెల్లూరు రావటం జరిగింది. నెల్లూరులోని దత్తసాయి మందిరానికి మాస్టరుగారు వస్తుండేవారు. అప్పట్నించి మళ్ళీ మాస్టరుగారితో పరిచయం ప్రారంభమయింది. వారి సత్సంగాలు వినేవాణ్ణి. వారు రాసిన పుస్తకాలు చదివేవాణ్ణి. కాని నా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వారి పుస్తకాలు కొనే ఆర్థిక స్తోమత నాకు లేదు. ఒకసారి మాస్టరుగారు దత్తసాయి మందిరానికి వచ్చినప్పుడు వారితో "మీరు వ్రాసిన పుస్తకాలు చదవాలని కోరిక వుంది కాని, నా దగ్గర డబ్బులు లేవు. నన్నేం చేయమంటారు" అన్నాను. "అదేందిరా ఒకసారి జాబు రాసి పడేస్తే, నేను నీకు ఊరికే పంపిస్తాగా" అన్నారు. సరేనని అలాగే చేసాను. వెంటనే మాస్టరుగారు ఆశీస్సులు కూడా వ్రాసి స్వంత ఖర్చుతో పంపించారు. అదే నా ఆస్తి. ఈ రోజుకు నాకు మిగిలినవి కూడా అవే. ఆ తర్వాత వారితో పరిచయం బాగా పెరిగింది. నా కష్టసుఖాలు వారితో చెప్పుకునేవాణ్ణి. ఒకసారి నాకు తీవ్రమైన ఇబ్బంది కలిగింది. ఆర్థికంగా దుర్భరమైన పరిస్థితి. మాస్టరుగారి దగ్గరకు వచ్చాను. మాస్టరుగారికి చెప్పుకోవాలి. వారి దగ్గర ఏదో ఒకటి పొందాలి అనే కోరిక, కానీ తీరా ఇక్కడకు వచ్చేసరికి గొంతు పెగలదు. గమ్మున్గా రావటం, గమ్మున్గా పోవటం. ఇలా రెండుసార్లు వచ్చాను. ఏమీ అడగలేక పోయాను.

మూడోసారి నోరు పెగల్చుకొని గట్టిగానే అడిగాను. "మాస్టరు గారూ నా పరిస్థితి దుర్భరంగా వుంది. ఇంట్లో అన్నానికి జరగటం కూడా చాలా కష్టంగా వుంది. ఏం చేయమంటారు"

అని అన్నాను. మొదటిసారి ఆయనకు నమస్కారం చేసేటప్పుడు "ఆధ్యాత్మికంగా నన్ను ఉన్నత దశకు తీసుకుపోండి" అని అనుకున్నాను. అలా మనసులోనే కోరుకున్నాను గాని, పైకి చెప్పలేదు. అది నా మనస్సులోనే గుప్తంగా వుండిపోయింది. తర్వాత దాన్ని పట్టించుకోలేదు. అసలు దాన్ని నేను మర్చిపోయాను. మూడోసారి గూడా మాస్టరుగారికి నమస్కరించినపుడు ఖచ్చితంగా అదే అన్నాను. "అది తప్పు కదరా. ఒరే వెధవా నువ్వు ఆయన్నేమి అడిగావురా" అన్నారు. "నేనేమి అడిగానయ్యా. నేనేమీ అడగలేదే. 'నా పరిస్థితి ఇట్లా వుంది. ఏదైనా వుపాయం చెప్పండి' అని అడిగాను. అంతే" అన్నాను. "అయనను అడిగిందేదో అదే ఆయన నీకు ఇస్తున్నాడు. అది తీసుకొని ఆయనను ఇంకేమీ అడగకు. అది వుంటే అన్నీ వుంటాయిరా, ఇక నుంచి నువ్వు కింగ్ వి రా" అన్నారు. "నేనేమి అడిగాను మాస్టరుగారు? నేనేమీ అడుగలేదు సార్" అన్నాను. "ఏయ్ నువ్వు ఆయన్ను 'ఆధ్యాత్మికంగా వున్నత దశకు తీసుకుపో' అని అడగలేదా!" అన్నారు. అప్పుడు నాకు గుర్తొచ్చింది. నాలుక కరుచుకొని 'అరె నిజమే కదా' అని. "ఈ విషయం నేనెందుకు మర్చిపోయాను? కానీ ఈయనెంత గుర్తు పెట్టుకున్నాడు. అదీ నేను ఆయనకు బయటకు చెప్పలేదు గూడా". అప్పుడాయన మీద పరిపూర్ణమైన విశ్వాసము కలిగింది. నమ్మకము ఏర్పడింది. ఈయన సామాన్యుడు కాదు. మహాత్ముడు. మహాత్ముడు కాకపోతే నా మనస్సులో మాట ఈయనకెలా తెలుస్తుంది. సరే అపుడు కూడా అడిగా "మాస్టరు గారు ఇంట్లో జరగటానికి చాలా ఇబ్బందిగా వుంది. తింటానికి తిండిలేదు. నన్ను, నా తల్లిని పోషించుకోవటం చాలా కష్టంగా వుంది. నన్నేం చేయమంటారు" అని అన్నాను. "సాయిలీలామృతము పారాయణ చేయి" అన్నారు. "అది చేస్తున్నాను మాస్టరుగారు. కాని ఈ పరిస్థితులలో చేయటం లేదు" అన్నాను. మాస్టరుగారు నాకు మూడే మూడు సూత్రాలు చెప్పారు. "ఒకటి ఎప్పుడూ దరిద్రంతో బాధపడాలని కోరుకో. రెండు ఎప్పుడూ రోగం రావాలని కోరుకో. మూడు ఎప్పుడూ కష్టం రావాలని కోరుకో. ఈ మూడు కోర్కెలు కోరుకో సాయినాథుడిని. ఆ మూడు కోరికలు ఎప్పుడైతే కోరుకుంటావో, అప్పుడాయన నీ ప్రక్కన ఎప్పుడూ వుంటాడు. అంతకు మించి ఇంకేమయినా అడిగావంటే ఆయన నీకెప్పుడూ దూరంగా వుంటాడు" అని అన్నారు. "సరేనయ్యా మొదలే నేను కష్టాల్లో వున్నాను ఇంక భవిష్యత్తులో కూడా కష్టాలే పడాలా? వాటినే కోరుకోమంటున్నావేంది?" అని అంటే, "అవుంటే ఆయన నీ ప్రక్కనే వుంటాడురా, ఆయన నీ ప్రక్కనే వుంటే ఇంక నీకేం కావాలి?" అన్నారు. "సరే మాస్టరుగారు" అన్నాను, ఆ తర్వాత ఆ కష్టాలు క్రమక్రమంగా నా కర్మానుసారం మాస్టరుగారి ఆశీస్సులతో తగ్గిపోసాగాయి.

ఒకసారి రామచంద్రాపురంలో విగ్రహ ప్రతిష్టకి మాస్టరుగారు, మేము వెళ్ళటం జరిగింది. అక్కడ్నించి కురుమద్దాలిలో మాల పిచ్చమ్మ అనే అవధూత సమాధి దగ్గరకు మమ్మల్ని తీసుకెళ్ళారు. అక్కడొక మఱ్ఱిచెట్టు వుంది. ఆ మఱ్ఱిచెట్టులో ఆమె తపస్సు చేసుకుని అక్కడ సిద్ధి పొందారు. ఆ విషయం మాకు చెప్పారు. ఆ చెట్ల చుట్టూ మేం ప్రదక్షిణలు చేస్తున్నాం. మూడో ప్రదక్షిణ తర్వాత నేను వారి పాదాలంటి నమస్కరించాను. "ఒరేయ్ ఎందుకురా నమస్కారం చేశావు" అని సౌమ్యంగానే అడిగారు. "మాస్టరుగారూ పవిత్రమైన స్థలంలో పవిత్రమైన వ్యక్తికి చేసిన నమస్కారము అత్యంత ఫలితాన్నిస్తుందని మీరే చెప్పారు. ఇంతకన్నా పవిత్రమైన స్థలం లేదు. మీకన్నా పవిత్రమైన వ్యక్తి నాకు కనబడలేదు. అందుకే మీ పాదాలను నమస్కరించాను" అని సమాధానమిచ్చాను. "ఒరేయ్ వెధవా అంత గుర్తు పెట్టుకున్నావా నువ్వు" అని అయన చాలా సంతోషంతో, ప్రేమతో అన్నారు.

ఒకసారి మాస్టరుగారు నెల్లూరు లోని దత్తసాయి మందిరానికి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వచ్చారు. వారితోపాటు పరమ పూజ్యులైన తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రులు గారు కూడా వచ్చారు. వారు ఉపన్యసిస్తున్నారు. నేను మాస్టరిగారి పాదాల వద్ద కూర్చున్నాను. నా మంద బుద్ధికి వారి ఉపన్యాసం అర్థం కావటం లేదు. వారు భాగవత, రామాయణాల గురించి చెప్తున్నారు. అప్పుడు మాస్టరుగారితో, "మాస్టరుగారు వారు చెప్పే పురాణాలు నాకేం అర్థం కావటం లేదు, మీరు చెప్పకూడదా చాలా బాగుంటుంది. మాకూ వినాలని వుంది" అన్నాను. అపుడు వారు వెంటనే "ఒరేయ్, బుద్ది లేదురా నీకు, చెంపలేసుకో ముందు" అన్నారు. "ఏంటి మాస్టరుగారు" అన్నా, ముందు చెంపలేసుకోమన్నారు. సరే

చెంపలేసుకున్నా. అప్పుడు చెప్పారు "వారు సాక్షాత్తు దత్త స్వరూపులు. ఆయన పర్మిషన్ ఇచ్చిన తర్వాతనే మనం చెప్పాలి గాని, మనంతట మనం చెప్పకూడదురా, తప్పురా" అన్నారు.

ఆ తర్వాత నేను వుద్యోగం కోసం ఒకతనిని నమ్మి ₹1500/- ఇవ్వడం జరిగింది. అతడు నన్ను మోసం చేసాడు. నా డబ్బు తిరిగి ఇవ్వలేదు. సరే మాస్టరుగారికి ఇంత పొడుగు వుత్తరం వ్రాసాను. "ఏమయ్యా నువ్వు చెప్పినట్లు సాయిబాబా చరిత్ర పారాయణ చేస్తున్నాను. ఒకతనిని నమ్మి డబ్బిచ్చాను. ఏందో పెద్ద. సాయినాథుడు నాకేం చేశాడు. నాకు వుద్యోగం ఇప్పించనూ లేదు. డబ్బులు పోయాయి. నేను చాలా ఇబ్బందుల్లో వుండి కూడా ఆ డబ్బుని తెచ్చిచ్చాను. ఇప్పుడు వారు నన్ను తిడుతున్నారు, కొట్టబోతున్నారు" అని. ఆయన వెంటనే వుత్తరం వ్రాసారు. "ఋణానుబంధం తప్పదురా. కాబట్టి సాయిబాబా చరిత్ర పారాయణ చేస్తూ నిన్ను మోసం చేసిన వాడికి మేలు జరగాలని కోరుకో. వాడికి మేలు జరిగితే నీ డబ్బులు నీకు వస్తాయి" అన్నారు. ఆ విధంగా చేస్తే వాడికి మేలు జరిగింది. సాయినాథుని అనుగ్రహం వల్ల మాస్టరుగారి ఆశీస్సుల వల్ల నా డబ్బులు నాకు తిరిగొచ్చాయి. చాలా సంతోషం వేసింది. అప్పట్నించి మాస్టారుగారంటే పరిపూర్ణమైన విశ్వాసం కలిగింది. మాస్టారుగారంటే ప్రేమ, అభిమానాలు పెరిగాయి. ఎప్పుడూ వారిని దర్శించినా "ఏరా బాగున్నావా? ఎప్పుడొచ్చావు, ఏంటిరా సంగతులు.. ఏం విశేషాలు. అందరూ బాగున్నారా? ఆ....శుభం" ఆ పలకరింపుకే నాకెంతో ఆనందం కలిగేది. వారి పిలుపులో, పలకరింపులో ఎంతో ఆప్యాయత, అనురాగం, ప్రేమ తొణికిసలాడేది. కన్న తల్లిదండ్రులలో కూడా అలాంటి ఆదరణ మనకు దొరకదు. ఇప్పుడు కూడా ఆ పిలుపు నా చెవులలో వేణుగానంలా విన్పిస్తూనే వుంటుంది. మారుమ్రోగుతూనే వుంటుంది. ఇంట్లో మామూలుగా సత్సంగాలు చేసుకుంటాను. సత్సంగాలలో మహాత్ముల చరిత్రలు చదువుకుంటాము. ఆరాధనలు చేస్కుంటూంటాము. స్వామి సమర్థ గారి ఆరాధన జరపాలని చెప్పి "మాస్టరుగారు ఈ విధంగా వారి ఆరాధన రోజున నేను సత్సంగం చేయాలనుకుంటున్నాను వారి ఆరాధన రోజు. కాబట్టి మీ ఆశీస్సులు నాకు పంపించండి" అని జాబు రాశాను. శ్రీవారి దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. "నీ యొక్క కార్యక్రమం సాయి యొక్క అనుగ్రహ ఆశీస్సులతో, జయప్రదంగా, జ్ఞానదాయకంగా సఫలం అగుగాక" అని. అది వారు నాకు రాసిన చివరి వుత్తరం. ఆ వుత్తరం నాకు చేరింది. నాకు చాలా సంతోషం వేసింది. మాస్టరుగారు వెంటనే నాకు ఆశీస్సులు పంపించారు. ఇక ఈ కార్యక్రమం గురించి ఆలోచించనవసరం లేదు. కార్యక్రమం దిగ్విజయంగా జరిగిపోతుంది అని అనుకున్నాను. కానీ ఒక అరగంటలో భయంకరమైన వార్త - మాస్టరుగారు మనకికలేరు. నమ్మలేని వార్త. కానీ నమ్మకమైన వారి నుండే అందింది. వెంటనే బయల్దేరాం. కాని టికెట్ కు డబ్బుల్లేవు. నెల క్రితం ఎవరో నాకు కొత్త చెప్పులు దానం చేశారు, అప్పట్నించి కొత్త చెప్పులు కరవటం వల్ల రెండు కాళ్ళకి పుండ్లు పడి మానక చీము పట్టి ఇంతలావున వాచి చాలా బాధ పెడుతున్నాయి. నడవలేకపోతున్నాను అయినా బయల్దేరాను. మాస్టరుగారి భౌతిక శరీరం చూడాలి ఇంక కన్పించదు కదా! అన్నదే నా ధ్యేయం. దోవలో తెలిసిన ఆప్తుడు "ఎక్కడికెళ్తున్నావు?" అంటే సంగతి చెప్పాను. ఆయన చార్జీకి డబ్బులిచ్చాడు. అమేన బయల్దేరి వచ్చేశాను. మాస్టారుగారిని దర్శనం చేసుకున్నాను. తరువాత కార్యక్రమం జరుగుతున్నది. వారికి మనం ఏం చేయగలం, నా దగ్గర డబ్బులేదు. ఏం చేయాలి అని ఆలోచిస్తున్నాను. వారికి సమాధి చేయడానికి గుంట త్రవ్వుతున్నారు. కనీసం రెండు పారల మట్టైనా తీద్దాం అంతకు మించి మనమేం చేయలేం. శరీర శ్రమైనా చేద్దాం అని చెప్పి రెండు పారల మన్ను తీశాను. అంతకు మించి చేయలేకపోయాను. ఆ తర్వాత మాస్టరుగారి అంతిమ వూరేగింపులో పాల్గొన్నాను.

సమాధి చేయటం అయిపోయింది. ఒంగోల్లోని మిత్రుడు "మా యింటికెళ్దాం రా" అన్నాడు. సరేనని వాళ్ళింటికి పోయాను. వాళ్ళమ్మగారొచ్చి"నాయనా లోపలికి రా" అంటే, "నేను రానమ్మా, మాస్టరుగారు సమాధి అయిపోయినారు కనుక మాకు సూతకం. లోపలికి రాను" అన్నాను. "మామూలు మనిషి పోతే సూతకం వుంటుంది కానీ మహాత్ములు పోతే సూతకం కాదు నాయనా. నువ్వు లోపలికి రా" అంది. లోపలికెళ్ళాను, స్నానంచేసి, భోం చేశాను. ఆ తర్వాత మామూలుగా కూర్చున్నా. అప్పుడు ఏంటబ్బా మామూలుగానైతే ఎంతో



ఇబ్బంది పెట్టేవి కాళ్ళు ఇప్పుడేమో తేలికగా వున్నాయి అని చూస్తే ఆ పుండ్లు పడిన ఆనవాలే లేదు. మాడి మసైపోయినాయి. అంతవరకు బాధించిన ఆ పుండ్లు ఆ క్షణంలో మాయమైపోయినాయి. అప్పుడు నాకు గురుచరిత్రలోని ఒక సంఘటన గుర్తొచ్చింది. గురుచరిత్రలో ఆ యవన రాజుకు వ్రణం వచ్చి ఎవరి వల్లా తగ్గకపోతే శ్రీ గురు దర్శనం వల్ల తగ్గుతుంది అని సలహా ఇస్తారు. ఆ సలహా మేరకు వారిని దర్శిస్తే "ఏదిరా నీ వ్రణం" అంటే అతను చూస్కుంటే వుండదు. మటుమాయమైపోతుంది. అలానే నా వ్రణం కూడా మాస్టారుగారి భౌతిక దేహ సందర్శనం జరగగానే మాయమైపోయింది. ఇది నమ్మశక్యం కానటువంటి నిజం.

ఆ తర్వాత మాస్టరుగారు స్వప్న దర్శనం ఇచ్చారు. బ్యాంక్ లోన్ కి అప్లై చేసి వున్నాను. అందరూ తెలిసిన వారైనా అది యింతవరకూ రాలేదు. సాయం చేసిన వారెవ్వరూ లేరు. సరే ఏంటీ పరిస్థితి అని గురుచరిత్ర, సాయిచరిత్ర పారాయణ చేస్తున్నాను. ఒక రోజు స్వప్నంలో మాస్టరుగారు గుళ్ళోంచి బయటకొస్తున్నారు. మొహంలో ఒక ప్రక్కనంతా ఒక విధంగా వుంది. "మాస్టారుగారు ఏంటి ఇటొచ్చారు?" అంటే "ఏరా బాగున్నావా! సరే నీకు లోన్ శాంక్షన్ చేశారా? నువ్వు బ్యాంక్ దగ్గరకెళ్ళి డబ్బులు తీసుకొచ్చుకో పో" అన్నారు. "లేదు మాస్టరుగారు వాళ్ళు నన్ను లోనివ్వకుండా తిప్పిస్తున్నారు" అన్నాను. "లేదురా నేను చెప్పాను నువ్వు రేపు బ్యాంక్ కెళ్ళి డబ్బులు తెచ్చుకో పో" అన్నారు. "సరే ఏంటి మాస్టరుగారు మీరిట్లా వున్నారు". "అరేయ్ అవన్నీ నువ్వడక్కూడదు తప్పురా" అని తలుపేసుకొని వెళ్ళిపోయారు. పక్కరోజు మాస్టరుగారు చెప్పారు కదా అని బ్యాంకు వెళ్ళగానే వాళ్ళు చెక్ తీసి చేతులో పెట్టారు. ఏంటీ విచిత్రం. అంతకు ముందు మూడు నెలలు నుంచి తిరుగుతున్నా ఇవ్వనివారు, నాకు కల రావటమేమిటి? ఆ కల ప్రకారం నేను బ్యాంక్ కి రావటమేమిటి? వాళ్ళు చెక్ చేతులో పెట్టటమేమిటి? సరే వారు భౌతికరూపంలో లేకపోయినా వారు నిత్యసత్యులు. వారు ఇప్పుడూ వున్నారు. ఎప్పటికీ వుంటారు.

వారి ఆశీర్వాదంతో షిర్డీ దర్శనము ఎందరో మహాత్ముల దర్శనము నాకు లభించాయి. వారు సాక్షాత్తు దత్త స్వరూపమే గాని సామాన్యులు కారు అనే దృఢ నమ్మకము వుంది.

**- సశేషం**

# నార్కే

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శ్రీ సాయిబాబాను దర్శించిన భక్తులలోఎంతగానోచదువుకున్నవారు గూడ ఎందరో వుండేవారు. వారిలో జి.జి.నార్కే ఒకడు. అతడు కలకత్తాలో ఎం.ఏ. పాసయ్యాక అతనిని నాటి ఆంగ్ల ప్రభుత్వం 1909లో ఉన్నత విద్యకోసం ఇంగ్లాండుకు పంపింది. అతడు మాంచెస్టర్ లో భూగర్భశాస్త్రంలో ఎమ్.ఎస్.సి. పట్టభద్రుడై ఆగస్టు, 1912లో మనదేశానికి తిరిగివచ్చాడు. అతని మామగారు నాగపూర్ కు చెందిన శ్రీమాన్ బూటీ. ఇతను విద్యావంతుడని సాటి భక్తులందరూ గౌరవించేవారు. ఆధునిక విద్యతోపాటు యితడు మహాత్ముల ప్రభావాన్ని వర్ణించే 'జ్ఞానేశ్వరి' వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు గూడ చదువుతుండేవాడు. అతడికంటే ముందునుండే అతని భార్య, తల్లి, మామగారు బాబాను దర్శిస్తున్నారు. సాయిబాబా మహాత్ములని, వారి దర్శనం చేసుకోమనీ బూటీ మొ॥న వారు నార్కేకు వ్రాసారు. అతడు, తన దర్శనానికి రమ్మని బాబా చెబితేనే వస్తానన్నాడు. అప్పుడా విషయం బూటీ ప్రస్తావిస్తే అతడు దర్శనానికి రావచ్చని బాబా చెప్పారు. కనుక ఏప్రిల్ 1913లో అతడు తన తల్లితో కలసి శిరిడీ వెళ్ళాడు. అతడు తన స్మృతులిలా వ్రాసాడు:

"నేను ఏప్రిల్ 1913లో మొదట శిరిడీ వచ్చాను. బాబాకు మావాళ్ళపై ఎంతో ప్రేమ. మా తల్లిగారు రాగానే ఒక్కొక్కసారి ఆయన సంతోషంగా ఎగిరి గంతేసి నృత్యం చేసేవారు. మాధవరావ్ దేశపాండే మశీదుకు వచ్చి నన్ను పరిచయం చేయబోతే బాబా, "నాకు వీణ్ణి పరిచయం చేస్తున్నావా? నాకితడు 30 తరాల నుండీ తెలుసు" అన్నారు. మొట్టమొదట నా హృదయంలో ముద్ర వేసుకున్నది వారి కన్నులే. వారి చూపు నన్ను అణువణువునా దూసుకుపోయింది. చావడిలో కూర్చున్న వారి రూపం నా హృదయంపై ముద్ర వేసుకున్నది. అంతరంగికమైన అనుభవాలు నాకు క్రమంగా కల్గాయి. నేను అచ్చటి వాతావరణానికి అలవాటుపడి వారికి సేవలు చేయడము, ఆరతులకు హాజరవడమూ ప్రారంభించాను.

సం॥1914లో ఒకరోజు బాబా కొన్ని కఫ్నీలు సిద్ధం చేయించి కొందరు భక్తులకు పంచుతున్నారు. నేనది దూరంనుంచి చూచి, ఆయన నాకుగూడ ఒక కఫ్నీ ప్రసాదిస్తే బాగుండుననుకొన్నాను. దానిని నా దగ్గర వుంచుకొని బాబా భజన వంటి ప్రత్యేక సందర్భాలలో ధరించవచ్చని నా భావం. కొద్ది సేపయ్యాక నన్ను తమ చెంతకు పిలిచి ప్రేమగా నా తల నిమురుతూ, "నీకు కఫ్నీ యివ్వనందుకు నన్ను తప్పుపట్టవద్దు. నీకివ్వడానికి ఆ ఫకీరు (భగవంతుడు) అనుమతించలేదు" అన్నారు. నేను ఉద్యోగాల కోసం కలకత్తా, బొంబాయి వంటి దూరప్రాంతాలకు వెళ్ళవలసి వస్తోందని, నన్ననుగ్రహించి మా వూరికి గాని, లేక శిరిడీకి గాని దగ్గరలో ఉద్యోగంలో స్థిరపరచమనీ ఒకరోజు మా అమ్మ బాబాను అడిగింది. "అతనిని పూణేలో స్థిరపరుస్తాను" అన్నారు బాబా. ఒక్కొక్కప్పుడు నాకు ఒకేసారి అనేక ఉద్యోగాలొచ్చి, వాటిలో ఒకదానిని

ఎన్నుకోవలసి వచ్చేది. ప్రతిసారీ బాబా నిర్ణయం తీసుకొనేవాణ్ణి. కానీ ఆయన ప్రతిసారీ చివరలో పూణేనగరాన్ని ప్రస్తావించేవారు. ఉదా : 1916లో ఒకవంక వారణాసిలో ప్రొఫెసర్ (అధ్యాపకుడు) ఉద్యోగము, బర్మాలో ఒక ఉద్యోగమూ వచ్చాయి. బాబాను అడిగితే ఆయన ప్రతిసారీ పూణే నగరాన్ని ప్రస్తావిస్తుంటే నేను నవ్వుకునేవాణ్ణి. కారణం పూణేలో నాకు తగిన ఉద్యోగావకాశాలే లేవు. కాని 1918 నుండి పూణేలో భూగర్భ రసాయనిక శాస్త్రాలలో అధ్యాపకుడుగా పనిచేస్తున్నాను. అంటే నా భవిష్యత్తంతా వారికి ప్రత్యక్షమన్న మాట!

నేను 1916 ప్రాంతంలో చాలా కాలం తర్వాత శిరిడీ వెళ్లాను. అక్కడ బాబాకు ఎవరే సేవ చేస్తున్నారో విచారించాను. వామనరావ్ పటేల్ ( వీరే తర్వాత శ్రీ సాయి శరణానందులయ్యారు) అనే న్యాయవాది నిత్యమూ బాబాకోసం భిక్షకు వెడుతున్నాడని విని నేను కొంచెం అసూయచెంది, 'ఆ సేవ నాకే ఎందుకివ్వగూడదు?' అనుకున్నాను. బాబా దర్శనానికి సమయమవడం వలన నేను సూటు, బూటు, టోపీలతోనే మశీదులోకి వెళ్ళాను. అప్పుడొకరు బాబాను, 'వామనరావ్ కు భిక్షాపాత్ర యిచ్చి గ్రామంలోకి పంపమంటారా?' అని మూడుసార్లడిగారు. అప్పుడు బాబా అకస్మాత్తుగా నన్ను చూపి, 'ఈ రోజు పాత్ర యిచ్చి యితనిని పంపండి' అన్నారు. నేను సూటు బూటుతోనే ఆ రోజు భిక్షకు వెళ్ళాను. అటు తర్వాత నాల్గు నెలల వరకూ నేను సామాన్యమైన దుస్తులు ధరించి నిత్యమూ మధ్యాహ్నం భిక్షకు వెళ్ళాను. ఆ పనికి బాబా నన్నే ఎందుకెన్నుకున్నారో ఎవరికీ అర్థంగా లేదు గాని, హృదయాంతర్యామియైన బాబా నా కోరిక గుర్తించి, అట్టి అవకాశమిచ్చారు. ఈ సదవకాశం ఆయన కొద్దిమందికి మాత్రమే యిచ్చేవారు.

సం॥1917లో పూణేలోని యింజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ పదవికి నేను అర్జీ పెట్టుకోవాలా అని బాబానడిగితే, ఆయన పెట్టుకోమన్నారు. ఆ ఉద్యోగానికి సంబంధించిన వారిని కలుసుకోవడానికి నేను పూణే వెళ్ళాను. పెద్ద సిఫార్సులతో ఆ పదవికి ఎన్నో దరఖాస్తులు వచ్చాయి. నా పరిస్థితి కష్టంగా వున్నది. నేను శిరిడీ విడిచి పెట్టాక బాబా అచటి వారిని, 'నార్కే ఎక్కడికి వెళ్ళాడు?' అని పదే పదే విచారించారుట. 'అతను ఉద్యోగ ప్రయత్నంమీద పూణే వెళ్ళాడు' అని చెబితే, 'భగవంతుడు అనుగ్రహిస్తాడు' అన్నారట. అప్పుడు 'నాకు బిడ్డలు కలిగారా' అని ఆయన మావాళ్ళను విచారించారుట. నాకెందరో బిడ్డలు పుట్టి చనిపోయారని చెబితే ఆయన తిరిగి, 'భగవంతుడనుగ్రహిస్తాడు' అన్నారట. అలాగే నాకు 1918లో ఆ ఉద్యోగమొచ్చి, 1919లో స్థిరమైంది. అప్పటినుండీ నాకు పుట్టిన బిడ్డలు నలుగురు క్షేమంగా వున్నారు. ఇవన్నీ నాకు బాబా అనుగ్రహంవల్లనే లభించాయి.

కేవలం లౌకిక శ్రేయస్సును మాత్రమే కోరేవారికి బాబా తమ ఆంతర్యం తెలియనిచ్చేవారుగాదు. లోతుగా ఆయననర్థం చేసుకోగలవారు వచ్చినపుడు మాత్రం వారికి బాబా తమ ఆంతర్యము, శక్తీ అర్థమయ్యేలా ప్రవర్తించేవారు. కనుక సామాన్యులు ఆయనను అర్థం చేసుకోలేకపోయేవారు. నేను మొదట నుండీ వారినెంతో నిశితంగా గమనిస్తూ వచ్చాను. ఆయనగూడ అది గుర్తించి, 'భలే, భలే' అని ప్రశంసించి, నన్ను ప్రోత్సహించేవారు. వారి ఆంతర్యాన్ని నేను లోతుగా గుర్తించలేకపోయినపుడు, "నీవెంత మందమతివిరా!" అని మందలించేవారు. వారియొక్క ప్రతిమాట, చేతగూడా ఎంతో లోతైన అర్థంగలిగి వుంటాయి. నాకు అన్నీ అర్థమయ్యేవి గావు.

బాబాను లోతుగా గమనిస్తే ఒక విషయం స్పష్టంగా తెలిసేది; ఆయన యీ లోకంలోనే గాక, యితర లోకాలలో గూడ పనిచేస్తుండేవారు. అర్థం చేసుకోని వారికి బాబా మాటలు అర్థం లేని పిచ్చివాగుడులా తోచేవి. అవెంతో భావగర్భితమైన పరిభాషతోను, నీతి కథలతోనూ నిండివుండేవి. పైకి ఆయన పచ్చి లౌకికులుగా, ఎంతో పేరాశ గలవారిలా కన్పించేవారు. ఒకసారి ఒకవ్యక్తి కొంతకాలమాయనను గమనించి, 'ఈయనలా రోజంతా డబ్బు గురించే మాట్లాడే కపట సాధువును నేనెక్కడా చూడలేదు' అన్నాడు. పాపం, బాబా పరిభాషలో 'పైసా' (డబ్బు) అంటే పుణ్యమని అతడికి తెలియలేదు. కాని వారి మాటలు అర్థమైతే వారి తత్త్వము, శక్తులు, పనులూ ఎంతో గొప్పవని, ప్రజలు ఆయననుండి సహకారము; రక్షణ, మార్గదర్శనమూ పొందే రీతి అతి చిత్రమైనదనీ అంగీకరించక తప్పదు.

సుమారు సం॥1914 ప్రాంతంలో

హార్దాకు చెందిన శ్రీమంతుడైన ఒక వృద్ధుడు తన భార్యతో కలసివచ్చి శిరిడీలో వున్నాడు. అతడు తీవ్రమైన క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. నెలా పదిహేను రోజులపాటు అతని ఆరోగ్య మెంతగానో మెరుగవుతూ వచ్చింది. కాని, రెండవమాసం చివర్లో అతని పరిస్థితి విషమించి అంతిమ ఘడియ సమీపించినట్లయింది. ఆ సమయంలో బాబా వద్దకెళ్ళి వారి ఆశీస్సులు కోరడానికి ఆ యింట్లో మగవాళ్ళెవరూ లేరు. అది తెలిసి నేనే బాబావద్దకు వెళ్ళాను. ఆయన ఆ రోగి మరణించడమే మేలని చెప్పి, "అతనికి ఊదీ ఏంచేయగలదు? అయినా అడిగారు గనుక తీసుకువెళ్ళి ఇవ్వు" అన్నారు. నేను ఊదీ తీసుకెళ్ళి యిచ్చానుగాని, బాబా అన్నమాట ఎవరితోనూ చెప్పలేదు. తర్వాత శ్యామా గూడ బాబా వద్దకు వెళ్ళి ఆ రోగి మరణించనున్నాడని చెప్పాడు. బాబా, 'అతడెలా చావగలడు? తెల్లవారగానే మరల బ్రతుకుతాడు' అన్నారుట. అంటే ఆ వృద్ధుడు చనిపోడని బాబా చెప్పారని వాళ్ళు అనుకున్నారు. కనుక అతడు చనిపోయాక వాళ్ళు శవం చుట్టూ దీపాలు పెట్టి మధ్యాహ్నం వరకూ అతడు బతుకుతాడేమోనని ఎంతో ఆశతో ఎదురుచూచారు. కాని చివరకు అంత్యక్రియలుగూడ జరిగిపోయాయి. ఆ కారణంగా ఆ వృద్ధుని బంధువులు బాబా తమకు వ్యర్థంగా ఆశ చూపారని తలచి శిరిడీనుండి వెళ్ళిపోయి, మూడు సం॥ల వరకూ మరల రానేలేదు. తరువాత ఒకరోజు వారి బంధువులొకరికి బాబా కలలో కన్పించారు; వారి తలపై ఆ చనిపోయిన వృద్ధుని తలవున్నది. అప్పుడు బాబా కుళ్ళిపోయిన అతని ఊపిరితిత్తులు చూపి, 'ఇంతటి చిత్రహింసనుంచి నేనే అతనిని రక్షించాను' అని చెప్పారు. అప్పటినుండి అతని బంధువులు మళ్ళీ శిరిడీ రాసాగారు. జీవునికి మరణం లేదని, అతడు మరలా జన్మకు రాగలడన్న భావంతో బాబా అన్నమాటలు వారు స్థూలంగా మాత్రమే అర్థం చేసుకొన్నారు.

తరచుగా బాబా, తాము అదృశ్యంగా సుదూర ప్రాంతాలకు వెడుతున్నట్టు చెబుతుండేవారు. ఉదయమే ధునివద్ద కొందరు భక్తులతో కూర్చుని, తాను ఏ దూర ప్రాంతాలకు వెళ్ళి, ఆ ముందటిరాత్రి ఎట్టి లీలలు చేసినదీ చెబుతుండేవారు. రాత్రంతా మశీదులోనో, లేక చావడిలోనో వారిచెంతనే నిద్రించేవారికి వారి భౌతికరూపం శిరిడీలోనే వున్నదని తెలుసు. అయినా వారు చెప్పినది అక్షరాలా నిజమని ఋజువయ్యేది. ఒక్కొక్కప్పుడు మరణానంతరం జీవులకు కల్గిన అనుభవాలుగూడ ఆయన చెబుతుండేవారు. ఒకసారి శిరిడీలో ఒక మార్వాడీ పిల్లవాడు చనిపోయాడు. అతని తాలూకువారు అంత్యక్రియలు పూర్తి చేసుకొని శోకంతో మశీదు చేరారు. అపుడా పిల్లవాని ఆత్మను గురించి బాబా, 'ఇపుడతడు ఆ నది (వైతరణీ)ని సమీపించి యిప్పుడే దాటుతున్నాడు' అన్నారు. ఎందరికో ఆయన వారివారి పూర్వజన్మల గురించిన వివరాలు చెప్పారు. నాతో నా గత జన్మలు నాల్గింటికి సంబంధించిన వివరాలు చెప్పారు. ఆయన అవి యితరుల సమక్షంలోనే చెప్పారుగాని, అవి నా గురించి, నావేనని ఎవరూ తెలుసుకోలేదు. చుట్టూ ఎందరున్నా ఒక వ్యక్తికి మాత్రమే అర్థమయ్యే రీతిన ఏమైనా చెప్పగల నైపుణ్యం వారికుండేది. ఒకేసారి కొద్ది చేతలు మరియు మాటల ద్వారా ఎందరో వ్యక్తులకు ఆయన మేలు చేయగల్గడమే ఆశ్చర్యమనిపించేది. అరుదుగా బాబా, 'నీవెక్కడున్నావు? నేనెక్కడున్నాను? ఈ ప్రపంచమెక్కడున్నది?' అనేవారు. అలానే ఎప్పుడైనా తమ శరీరాన్ని చూపుతోనో, లేక తాకుతూనో, 'ఇది నా ఇల్లు మాత్రమే. నేనిప్పుడు యిక్కడలేను. నా గురువు నన్నిందులోనుండి బైటికి తీసివేశారు' అనేవారు. అంటే వారు సశరీరులుగా వున్నప్పుడే ఆ శరీరానికి పరిమితులుగారు. ఈ రోజుగూడ ఆయన గురించి, 'సాయిబాబా సజీవంగానే వున్నారు. ఆయన అప్పుడెక్కడున్నారో అక్కడే యిప్పుడూ వున్నారు. ఇప్పుడెక్కడ వున్నారో అక్కడే అప్పుడుగూడ వున్నారు' అని ఖచ్చితంగా చెప్పవచ్చు. అరుదుగా ఆయన తమ అవతార కార్యమేమో, భూమిపై మరియు యితర లోకాలలోనూ తమ కార్యమేమో సూచిస్తుండేవారు. చనిపోయిన జీవుల గతులపై తమ ఆధిపత్యాన్ని అనేకసార్లు సూచించారు. ఈ విశ్వక్రమంలో వారి కర్తవ్యమలా సూచించారు. సాయిబాబా ఎన్నడూ అసత్యం చెప్పలేదు. అర్థంలేని పదజాలం ఎన్నడూ గుప్పించలేదు. కాని వారి పద్ధతులెరిగినవారు మాత్రమే వారి చేతలు, మాటలు తెలుసుకోగల్గేవారు – అదిగూడ వారికవి అర్థం గావాలని బాబా ఉద్దేశిస్తేనే.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

## బదరీనాథుడు, సాయి వేరనుకుంటున్నావా?

నేను మొట్టమొదటిసారిగా బొంబాయిలో జూన్ 6, 1926లో ఉద్యోగంలో చేరినపుడు నాకు శిరిడీసాయి బాబా పేరు కూడ తెలియదు. తరువాత తరచుగా నా మిత్రుల నుండి ఆ పేరు వినటం జరిగింది. కాని, శిరిడీ ఎక్కడుందో, ఎలా వెళ్ళాలో తెలియదు. కొంతకాలానికి గోపాల గణేశ్ అనే సాయి భక్తుడు పరిచయమయ్యాడు. అతడు తెప్పించే 'శ్రీసాయిలీల' మాసపత్రిక, చిన్న ఊదీ పొట్లము నాకు ఇస్తూ ఉండేవాడు. ఆ పత్రిక చదువుతూంటే నాకెంతో శాంతి, సంతోషం కలిగేవి. సాయిబాబా గొప్పతనం గురించి తెలిశాక, నాకు శిరిడీ వెళ్ళాలని కోరిక కలిగింది. అయినా కొన్ని సం॥లు గడిచినా నాకు ఆ శుభ సమయం రాలేదు.

సుమారు మార్చి 1948 నుండి బదరీనాథ్ యాత్రకు వెళ్ళాలని సంకల్పముండేది. కాని అంతదూరం ఆ క్రొత్తచోటికి తోడు లేకుండా వెళ్ళలేననిపించింది. ఒకరోజు నా మిత్రుడు నా సంకల్పం గురించి విని, తానిదివరకే రెండుసార్లు ఆ క్షేత్రం దర్శించానని, మరలా ఒక వారంలో వెళ్ళాలనుకుంటున్నానని చెప్పాడు. ఎంతో సంతోషంగా నేనుకూడ వస్తానని చెప్పాను. ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నాను. ఇంతలో నా మిత్రునికి ఢిల్లీనుండి ఒక టెలిగ్రామ్ వచ్చింది. అతని కూతురుకు జబ్బుగా ఉందని, వెంటనే నా మిత్రుడు ఢిల్లీ బయలుదేరి వెళ్ళిపోయాడట. ఆ సంగతి మేము ఢిల్లీ బయలుదేరవలసిన ముందటిరోజు నాకు తెలిసింది. నేను ప్రయాణంమానుకోవలసివచ్చినందుకు ఎంతో బాధపడి, ఆ బాధతోనే నాటి రాత్రి నిద్రించాను. తెల్లవారుజామున 3గం॥లకు నాకు స్వప్నము వచ్చింది.

నేను, మరొక వ్యక్తి మా సామాన్లు భుజాలకు తగిలించుకొని బదరీనాథ్ కు వెళ్ళే మార్గాన నడుస్తున్నాము. అదొక భయంకరమైన రైలు మార్గం. రెండున్నర అడుగులు వెడల్పుగల ఆ బాట అడవిగుండా మెలికలు తిరుగుతూ పోతుంది. దానికి ఇరుప్రక్కలా ముళ్ళూ పొదలూ ఉన్నాయి. ఇంతలో అకస్మాత్తుగా మా యెదుట 10 లేక 12 అడుగుల దూరంలో ఒక భయంకరమైన పెద్దపులి ఎదురైంది. అది భయంకరంగా నోరంతా తెరచి నా వైపే చూస్తోంది. నాకెంతో భయమేసి వళ్ళంతా వణుకు, చమట పుట్టేసింది. నాకేం చేయాలో తోచలేదు. వేరు దిక్కులేక బదరీనాథుని పేరు, సాయినాథునిపేరు స్మరించడం మొదలుపెట్టాను. చిత్రం మరుక్షణమే ఆ భయంకరమైన పెద్దపులి అంతకంతకు చిన్నదై పోయి చివరకు ఒక పిల్లి అంతటిదై బాటప్రక్కనున్న పొదలోకి దూకి అదృశ్యమైనది! మరుక్షణమే శ్రీ సాయినాథుని పోలియున్న ఒక వృద్ధుడు దర్శనమిచ్చాడు. ఆయన నాకేసి తదేకంగా చూస్తూ, "బదరీనాథుడు మరియు సాయినాథుడూ వేరనుకుంటున్నావా! బదరీనాథుడేదో సాయినాథుడు అదే; సాయినాథుడేదో.. బదరీనాథుడదే. ఈ సత్యం తెలుసుకొని నా నామం 5000 సార్లు జపించు" అని చెప్పి అదృశ్యులయ్యారు.

మరుసటిరోజు నేనలాగే చేసి జనవరి, 1949లో శిరిడీ దర్శించాను.

**- ఆర్. డి. నాయక్,**
**బొంబాయి**

# ఆచార్యుని అద్భుత లీలలు

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని వెంకటగిరిలో వుంటున్న శ్రీమతి ఉప్పలపాటి సుజాతాదేవిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు---

నేను 1974-75 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుకోవడానికి విద్యానగరు కళాశాలలో చేరాను. అమ్మ, నేను, మా అన్నయ్య శ్రీనివాసమూర్తి చెందోడులో అద్దెకు ఇల్లు తీసుకున్నాము. రోడ్డుకి అటువైపు ప్రాంతాన్ని చెందోడు అని, ఇటువైపు విద్యానగరు అనీ అంటారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలపాటు పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు మాకు ఇంగ్లీష్ అధ్యాపకులుగా వచ్చేవారు. నా జీవితాన్ని మలుపు తిప్పిన రోజులవి. మానవరూపంలో తిరుగాడే మహాత్మునికి సమకాలికులమవ్వడం మా అదృష్టం.

నాకంటే ముందు మా అన్నయ్య శ్రీనివాసమూర్తి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో జరిగే సత్సంగాలకు వెళ్ళేవాడు. తరువాత అమ్మ, నేను కూడా వెళ్ళేవాళ్ళం. మా పెద్దన్నయ్య అకస్మాత్తుగా చనిపోయాడు. పూజ్యశ్రీ మాస్టరుగారిని చూసినప్పుడల్లా మా అమ్మకి మా పెద్దన్నయ్య జ్ఞాపకానికి వచ్చేవాడుట. అదే విషయం ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారితో చెబితే, "అమ్మా, ఇప్పుడేమైంది? నేనే మీ కొడుకుని అనుకోండి!" అన్నారు. అప్పటినుంచి నేను మాత్రం ఆయనని మా అన్నగానే భావించేదాన్ని. పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు నన్ను వారి స్వంత బిడ్డలాగా చూసుకున్నారు.

అప్పుడు ఇంటర్మీడియట్ లో రెండు సంవత్సరాలకీ కలిపి ఒకేసారి పరీక్షలుండేవి. ఇంగ్లీషులో 70 మార్కులు రావాలి, కానీ నాకు 67 మాత్రమే వచ్చాయి. కానీ అదృష్టవశాత్తు 5 మార్కులు మోడరేషన్ కలిపారు. అందువల్ల పాసయ్యాను. కానీ చిత్రంగా డిగ్రీలో పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను ఇంగ్లీషు లిటరేచర్ తీసుకోమన్నారు. అప్పటికే మా బావగారైన శ్రీ సుబ్రహ్మణ్యంగారు (తెలుగు HOD) నా పేరు తెలుగు లిటరేచర్ లో వ్రాసేశారు. అది తెలిసి నేను వెంటనే ప్రిన్సిపాల్ గదికి వెళ్ళి, మళ్ళీ ఇంగ్లీషు లిటరేచర్ లోకి మార్చేసుకున్నాను. అప్పటినించి రోజుకి రెండుసార్లు పూజ్యశ్రీ మాస్టరుగారి క్లాసు వినే అదృష్టం కలిగింది. ఆరోజు నేను పూజ్యశ్రీ మాస్టరుగారి మాట వినడంవల్ల తరవాతి కాలంలో నెల్లూరు జిల్లాలోనే మొట్టమొదటి ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా నన్ను నియమించారు. ఆయన చెప్పినది చెప్పినట్టు చేస్తే చాలా శ్రేయస్కరం.

నేను కాలేజీకి వెళ్ళేటప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటి మీదుగానే వెళ్ళాలి. అందుకని ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్ళి కొంతసేపు ధ్యానం చేసుకుని అక్కడనుంచి బయలుదేరేదానిని. ఇంచుమించు పూజ్యశ్రీ మాస్టరుగారు ముందు, నేను వెనక వెళ్ళేవాళ్ళం. అలా వెళ్ళేటప్పుడు దారిలో చిన్న చిన్న పిల్లలు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసేవాళ్ళు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా ప్రతివాళ్ళకి రెండుచేతులూ జోడించి నమస్కరించేవారు.... 'చిన్నపిల్లలు, వాళ్ళని పట్టించుకునేదేమిటి?' అని అనుకోకుండా!! అది చూసి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. తరవాత క్లాసులో ఒకసారి, 'మనకు ఎవరైనా ఎదురుపడితే 'నమస్తే!' అని చేతులు జోడించి పలకరించాలని, వాళ్ళు ఎవరైనా కావచ్చు... వారి అంతరంగంలోని బాబాకి నమస్కరిస్తున్నామని మనం భావన చేసుకోవాల'ని చెప్పారు.

నేను బి.ఎ. చివరి సంవత్సరంలో వుండగా భావాతీత ధ్యానం నేర్చుకునే అవకాశం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్ల

ప్రోద్బలంతో (చదువు అక్కడికి ఆపి) నేను, అనసూయ, లలిత భోపాల్ లో TM నేర్చుకోవడానికి వెళ్ళాము. అక్కడ ధ్యానం, ఆసనాలు, మౌనం పాటించడం -- ఇవన్నీ బాగా జరిగేవి. నాకు అప్పుడు మహర్షి మహేష్ యోగిగారి దర్శనం చేసుకోవాలనిపించింది. అప్పుడు ఆయన స్విట్జర్లాండులో వున్నారు. ఈ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉత్తరం వ్రాసాను. అప్పుడు, "ధ్యానం బాగా చేస్తూవుంటే మహర్షిగారిని చూడాలన్నకోరికగాఢంగావుంటేతప్పక తీరుతుంది" అని జవాబు వ్రాశారు. అద్భుతమైన పూజ్యశ్రీ మాస్టరుగారి కృపాకటాక్షంవల్ల మహర్షిగారు స్విట్జర్లాండునుంచి భోపాల్ వచ్చారు. నాకు చాలా సంతోషం కలిగింది. భావాతీత ధ్యాన శిక్షణ అనంతరం నేను, అనసూయ, లలిత కోట గ్రామంలో మహిళాధ్యానవిద్యాపీఠం ఏర్పాటు చేసాము. స్కూలు పిల్లలకి, మహిళలకి ధ్యానము, ఆసనాలు నేర్పించేవాళ్ళం.

B.A. మూడవ సంవత్సరం పరీక్షలు (ప్రైవేటుగా) వ్రాశాను. చివరి పరీక్ష Advanced English. అన్ని పరీక్షలు బాగా వ్రాసాను. ఈ పరీక్షకి కూడా బాగానే చదువుకున్నాను. పరీక్ష హాలులో ప్రశ్నాపత్రం చూసాను. ఐదు ప్రశ్నలకు సమాధానం వ్రాయాలి. నాకు నాలుగు ప్రశ్నలే తెలుసు. నాకు ఐదు వ్రాస్తేనే 35 మార్కులు రావడం కష్టం. ఇక చేసేదిలేక ప్రశ్నాపత్రం ఇచ్చేసి బయటికి వచ్చేద్దామనుకుంటే అర్ధగంట తరవాతే బయటికి పంపుతామని చెప్పారు. నేను ఖాళీగా కూర్చుని వున్నాను. అప్పుడే ఒక అద్భుతం జరిగింది. ఆరోజు కాలేజీకే రాని పూజ్యశ్రీ మాస్టరుగారు నా ఎదురుగా నిలబడి, "వ్రాయమ్మా, వ్రాయి!" అన్నారు!! అది నాకు భ్రమా, నిజమా అర్థం కాలేదు. మళ్ళీ పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించలేదు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు అలా చెప్పిన తరువాత నేను జవాబు తెలియదనుకొన్న ప్రశ్నకి సమాధానం హిస్టరీ పాఠ్యాంశంలో వున్నదని గుర్తుకొచ్చింది. వెంటనే వ్రాసేశాను. అయినా సరే పాస్ అవుతానని నమ్మకం రాలేదు. సెప్టెంబరులో పరీక్ష ఫీజు కట్టడానికి కాలేజీకి వెళ్లి ఎన్ని మార్కుల్లో పోయిందని అడిగాను. "మీరు పాస్ అయ్యారమ్మా!" అని చెప్పారు!! అంటే ఆరోజు పరీక్ష హాలులో జరిగినది భ్రమ కాదు, వాస్తవం! పూజ్యశ్రీ మాస్టరుగారు నిజంగానే దర్శనమిచ్చారన్నమాట!! వారి ప్రేరణతోనే పరీక్ష వ్రాయడం జరిగింది. ఆనాటి దృశ్యం ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లు గుర్తుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను బి.ఇడి.(B.Ed) చేయమన్నారు. నేను, "భావాతీతధ్యానం నేర్చుకున్నాను కదా, ఇంకా అది ఎందుకు?" అన్నాను. నాకు బి.ఇడి చేస్తే పూజ్యశ్రీ మాస్టరుగారికి దూరమవుతానేమోనని భయమేసింది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఇప్పుడు యిలా అనిపించినా తరువాత అయ్యో చెయ్యలేదని బాధపడవలసి వస్తుంది" అన్నారు. సరేనని విద్యానగరులో బి.ఇడిలో చేరాను. 1982 లో పూర్తయింది. 1983 లో వెంకటగిరి దగ్గర వడ్లమోపూరులో ఉపాధ్యాయినిగా ఉద్యోగంలో చేరాను.

1985వ సంవత్సరంలో నాకు వివాహం జరిగింది. ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు--- వీటితో అంతకు ముందులాగా బాబా పూజలు చేయడం తగ్గింది. ప్రతి సంవత్సరం పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు ఇంట్లోనే జరుపుకునేదానిని. నా తలపులలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడూ వుండేవారు. 1989 ఏప్రిల్ 7 వ తేదీన పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు ఉత్తరం వ్రాసారు. "చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలు వ్రాయాలని అనుకుంటున్నాను. రాజాగారి గ్రంథాలయంలో వాటికి సంబంధించిన పుస్తకాలు వుంటే చూసి, వాటిని తీసుకుని నువ్వు రా!" అని. ఏప్రిల్ 12వ తేదీ ఉదయం R.V.M కాలేజికి వెళ్లి ఆ పుస్తకాల గురించి మాట్లాడి ఇంటికి రాగానే పూజ్యశ్రీ మాస్టరుగారి నిష్క్రమణ వార్త రేడియోలో విని స్థాణువైపోయాను. నేను తప్పు విన్నానేమోనని మరొక సత్సంగసభ్యుని దగ్గర నిర్ధారణ చేసుకున్నాను. మా పెద్దబాబు పుట్టి అప్పటికి ఆరు నెలలు. ఎక్కడికీ కదలలేని పరిస్థితి. గుండె రాయి చేసుకోవడం తప్ప చేసేదేముంది? మా రెండవ బాబుకి 'భరద్వాజ' అని పూజ్యశ్రీ మాస్టరుగారి పేరు పెట్టుకున్నాను.

'ధర్మమే వారి రూపు ధరించి వచ్చిందా!' అన్నట్లుండేవారు పూజ్యశ్రీ మాస్టరుగారు. ఖచ్చితంగా వారు అవతారపురుషులే! అప్పటి విద్యానగరువాసుల పుణ్యఫలమేమో గాని మా అందరికీ నడిచేదేవుడితో సహజీవనంచేసే భాగ్యం కలిగింది. జన్మజన్మలకూ వారి సన్నిధిభాగ్యాన్ని ప్రసాదించమని వారి పాదపద్మములకు ప్రణమిల్లుతున్నాను.

ఓం గమనాగమనరహితాయ
భరద్వాజాయ నమః!
జై సాయి మాస్టర్!!

## చెప్పింది అర్థం చేసుకోవాలి! ఆచరించాలి!

03వ పేజీ తరువాయి

అవెలా సమర్పించాలి? సాయి తమ గురువును సేవించినట్లు సేవించాలి. రమణమహర్షి ఆత్మనిష్ఠులై లోకాన్ని మరచినట్లు సద్గురు నిష్ఠలో లోకాన్ని మరవాలి. రామకృష్ణ పరమహంస జగన్మాత అనుగ్రహానికై పరితపించి ప్రాణం విడవటానికి సిద్ధమైనట్లు మనము సిద్ధమై తపించాలి

సాయి హజీసిద్దిక్ ఫాల్కేతో నిగూఢంగా "బార్వీ బావిదగ్గరకు ఇరుకు కాలిబాటన వస్తాడేమో అడుగు" అని కబురు చేస్తారు. అందుకతడు అంగీకరించాక అతనిలోని బలహీనతల పట్ల పట్టరాని ఆగ్రహంతో – శస్త్రవైద్యుడు రాచకురుపుమీద దాడి చేసినట్లు – దాడిచేస్తారు.

ఇంత శ్రమకు మనము సిద్ధమా? సాయి దయతో మన సాంసారికమైన కోరికలు సమస్యలు తీర్చుకొనేందుకు పడేయత్నము, వాటికోసం మనం మానవయత్నం చేసినంతగా పరమార్థం కోసం చేయడానికి సిద్ధమా? మన కది పరమార్థమేనా? సాయిని దర్శించిన లక్షలమందిలో ఆయనివ్వదలచిన పరమార్థాన్ని కోరేవాడు గాని, తమ గురువును ఆయన సేవించినంతగా వారిని సేవించినవాడుగాని – అంటే శిష్యుడని చెప్పదగ్గవాడు – ఆయనకొక్కరు గూడ దొరకలేదట. వారి గురువుకుగూడ ఆయనొక్కడే దొరికాడట! చివరికి ఉపాసనీ బాబా, మహల్సాపతి, తాత్యాలనుగూడ ఆయన ఆ లెక్కలో చేర్చలేదంటే కర్తవ్యమెంత తీవ్రమో ఆలోచించుకోవాలి.

## అవధూత చివటం అమ్మ

05వ పేజీ తరువాయి

14. కాయలు కాయని చెట్టు క్రింద కూర్చోవాలే.

15. వినడం కూర అంత వినాలి – ధ్యానం అన్నమంత చేయాలి.

### భగవంతుని గురించి:

16 ఏసూ, రాముడూ వేరుకాదు.

17. ఓర్పు ఉండాలి, ఓర్పే దేముడు.

18. ఇది 'నేను' కాదు – ఇది 'నేను' కాదు – అనుకుంటూ పోతే, చివరకు మిగిలేదే నేను. ఆ 'నేనే' భగవంతుడు.

### తన గురించి తాను:

19. ఇది ఇకరాదు, ఇక జన్మకు రాదు.

20. ఇక్కడకు వచ్చాక కూడా కర్మ ఎక్కడుంది.

## సమాప్తం

## పరిప్రశ్న

08వ పేజీ తరువాయి

భాగాలలోనూ అలానే జంతువుల, మరియు వృక్షాల, దేహభాగాలలోనూ వివిధ దేవతలుంటారని శాస్త్రాలు చెబుతున్నాయి. అటువంటప్పుడు ఏ దేవతలైనా ఏ ఒక్కరినో పూనడము, అంటే ఒక వ్యక్తిలోనికి రావడము, ఎలా సాధ్యం? స్థూలంగా చెప్పాలంటే, ప్రతి రేడియోలోనూ, టి.వి సెట్టులోనూ వేరు వేరు ప్రసారకేంద్రాలనుండి వచ్చే శబ్దాలను, రూపాలను గ్రహించి ప్రకటించే శక్తి సామర్థ్యాలున్నట్లే, ప్రతిజీవిలోనూ అందరు దేవతలూ వుంటారు. అంటే వేరు వేరు దేవతలుగా పిలవబడే దివ్యమైన శక్తి సామర్థ్యాలు గల ఒకే పరమాత్మ అన్నింటిలోనూ వుంటాడు.

పూనకాలు నిజమని నమ్మాలంటే వేదాల దగ్గరనుండి మహనీయులవరకూ అందరు చెప్పినదీ అబద్ధమే కావాలి! అలా అయితే నాస్తికత్వం ఒక్కటే నిజమవుతుంది. అప్పుడు గూడ పూనకాలు నిజమయ్యే అవకాశమే వుండదు!! ప్రజలకు ఈ పరమ సత్యం ఎంత త్వరగా తెలిపితే వారిని అంత త్వరగా నిరాధారమయిన భయాలనుండి, ఆశా వ్యామోహాల నుండి విముక్తులను చేయవచ్చు. వాటి సహాయంతో ప్రజలను అసలైన ఆధ్యాత్మ విద్య నుండి దూరంగా వుంచి స్వార్థం సాధించుకోజూచే వారి గోలను అంతమొందించుకోవచ్చు. అలా గాకుంటే, మానజాతిని ఉద్ధరించగల ఏకైక మార్గమైన ఆధ్యాత్మిక విద్యయే జాతి యొక్క నైతిక పతనానికి దారితీస్తుంది.

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

SRI GURUPADUKA PUBLICATIONS,
C/O SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |

**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**



పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ తల్లి జన్మదినోత్సవము సందర్భంగా
అక్టోబర్ 1, 2021న గుమ్మళంపాడులో మాతృదేవి సన్నిధిలో జరిగిన వేడుకలు

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



గుమ్మళంపాడులో మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మ తల్లి సన్నిధిలో
విజయదశమి(15-10-2021) నాడు జరిగిన శ్రీ సాయిబాబా మహా సమాధి వేడుకలు

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.